Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.08.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 09 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



## తెలుగు రాష్ట్రాల మధ్య... తగవులాట!

***భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రోజు మత ప్రాతిపదికన ఈ దేశం నుండి పాకిస్థాన్ విడిపోయింది. దాని పర్యవసానాన్ని మనం ఈ రోజుకి కూడా అనుభవిస్తున్నాం. మనలో ఒక భాగంగా వుండి విడిపోయిన దేశమే ఇప్పుడు మనకు పక్కలో బల్లెంగా మారింది.***

ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన కూడా పాకిస్థాన్ తరహాలోనే జరిగింది. అధిక సంఖ్యాకుల మనోభావాలను పక్కన పెట్టి ఓట్లు – సీట్లు ప్రాతిపదికన గత యూపిఏ ప్రభుత్వం ఈ రాష్ట్రాన్ని విడదీసింది. విడదీస్తే వచ్చే సమస్యలను వేటిని కూడా ఆరోజు యూపిఏ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదు. వారి మానాన వారు ఛస్తారులే అని ఊరుకుంది. చాలా కీలకమైన సమస్యలు తలెత్తుతాయని తెలిసినా వేటికీ శాశ్వత పరిష్కారం చూపలేదు. ఇప్పుడు అవే సమస్యలు ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలకు కేంద్రమవుతున్నాయి. విడిపోయిన తర్వాత కొట్టుకోవడానికి భారత్‌కు పాకిస్థాన్ కన్నా కొంత సమయం పట్టింది. కాని ఆంధ్ర, తెలంగాణలు తన్నుకోవడానికి పెద్దసమయం పట్టలేదు.

తెలంగాణ ఏర్పాటు చేసే ముందు హైదరాబాద్‌లో స్థిరపడిన వారి బ్రతుకు, భవిష్యత్ గురించి గత కేంద్రప్రభుత్వం ఆలోచించలేదు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ వారి స్థానికతపై ఒక స్పష్టత ఇవ్వలేదు. ఎన్ని సంవత్సరాల నుండి అక్కడ స్థానికులవుతారో కేంద్రమే స్పష్టం చేసి బిల్లులో పొందుపరచి వుంటే ఈరోజు వేలాదిమంది విద్యార్థుల బ్రతుకు గాల్లో ఉండేదికాదు. స్థానికులకే ఫీజు రీయంబర్స్‌మెంట్ అంటున్న కేసీఆర్ 1956కు ముందున్న వారికే స్థానికత వర్తిస్తుందని పేచీ పెడుతున్నారు. ఈ లెక్కన చూస్తే హైదారాబాద్‌లో ఉన్నోళ్లలో నూటికి 80మంది స్థానికులు కాదు. కాని కేసీఆర్ సర్కార్ దీనిపై మెట్టు దిగడం లేదు. ఆగస్టు 7 నుండి ఎంసెట్ కౌన్సిలింగ్‌కు నోటిఫికేషన్ జారీ చేసినా దానిని తాము

(మిగతా 10వ పేజీలో)

✹ నెల్లూరుపై

## నిర్లక్ష్యం!



రాష్ట్ర విభజన జరిగిపోయింది. సీమాంధ్రలోని ***13జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ మిగిలింది. తెలంగాణతో కలిసి వున్నంతకాలం ప్రతి ముఖ్యమంత్రి హైదరాబాద్ అభివృద్ధికే అంకితమయ్యారు. వేలకోట్ల రాష్ట్ర సంపదనంతా అక్కడే దారబోసారు. మన ఎన్టీఆర్, మన వై.యస్., మన చంద్రబాబు... హైదరాబాద్ తమ సొంతూరన్నట్లుగా అక్కడే అభివృద్ధినంతా కేంద్రీకరించారు.***

కనీసం వీళ్లు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడే సీమాంధ్రలో ఇంకొన్ని నగరాలను అభివృద్ధి చేసి వుండొచ్చు. జాతీయ సంస్థలను ఈ ప్రాంతానికే తెచ్చి ఉండొచ్చు. కాని ప్రతిదీ హైదరాబాద్‌లో పెట్టించి తప్పుచేసారు. ఈరోజు విభజనతో చేతులు కాలాయి. ఇక ఆకులు పట్టుకుని

(మిగతా 10వ పేజీలో)

✹ సమర్ధతే

## గీటురాయి



***తన ఉద్యోగ జీవితంలో ప్రతి అధికారి కూడా ఒక్కసారైనా విధులు నిర్వహించాలని కోరుకునే ఏకైక ప్రాంతం నెల్లూరుజిల్లా. ఇక్కడ మావోయిజం లేదు, ఫ్యాక్షనిజం లేదు, గూండాయిజం అంతకన్నా లేదు. ఇతర జిల్లాలతో పోలిస్తే రాజకీయ ఒత్తిళ్లు తక్కువ. ఇక వాతావరణం, నాగరికత పరంగా చూస్తే ఎంతో మంచి పేరున్న ఊరు నెల్లూరు. ఈ జిల్లాలో అధికారిగా పనిచేసి సమర్థుడిగా పేరు తెచ్చుకుంటే రాష్ట్రంలో ఇక ఆ అధికారి పరుగుకు తిరుగుండదు.***

రాష్ట్రంలోనే ప్రత్యేకత కలిగిన నెల్లూరుజిల్లా నూతన ఎస్పీగా ఎస్.సెంథిల్ కుమార్ జులై 30వ తేదీ ఉదయం 11గంటలకు నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. తమిళనాడుకు చెందిన

(మిగతా 10వ పేజీలో)



# పోస్టింగ్‌ల కోసం...
# పరువు తాకట్టు



**మన రాష్ట్రంలోని అధికారిక వ్యవస్థల్లో విపరీత ధోరణులు నెల కొంటున్నాయి. విషతుల్య వాతావరణం అలుముకుంటుంది. భవిష్యత్‌లో ఈ పరిణామాలు అన్ని ప్రభుత్వ వ్యవస్థలను కూడా దారుణంగా దెబ్బతీయడమే కాదు, పనికిమాలిన వాటిగా మార్చేస్తున్నాయి.**

రాజకీయాల్లో నీతి, నిజాయితీ, కొంత నిబద్ధత ఉన్న కాలంలో అధికారుల పని తీరును, సమర్ధతను బట్టి వారికి పోస్టింగ్ లుండేవి. వారి నిజాయితీని బట్టి బదిలీ లుండేవి. సమర్ధవంతంగా పనిచేస్తే పత కాలు, ప్రజలకు మెరుగైన సేవలందిస్తే ప్రశంసలుండేవి. రాజకీయ వ్యవస్థలో నిబద్ధత ఉన్నంతకాలం అధికారులు, ముఖ్యంగా పోలీసులు కాలరెగరేస్తూ పని చేసారు. పౌరుషానికి ప్రతీకగా నిలిచారు.

కాని గత కొన్నేళ్లుగా ప్రభుత్వ శాఖల్లో మరీ ముఖ్యంగా పోలీసుశాఖలో రాజ కీయ జోక్యం అధికమైపోయింది. దీనివల్ల పోలీసులు ప్రజలకు బదులు నాయకుల సేవకు ఎక్కువుగా అంకితమైపోవాల్సి వస్తుంది.

కొన్నేళ్ల క్రితం ఒక ఎస్‌ఐ స్థాయి అధి కారికి పదవి విషయమై సిఫారసు చేయాల్సి వచ్చినా ఎమ్మెల్యేలు జంకేవాళ్లు. రిక్వెస్ట్ చేసుకునే వాళ్లు. ఎస్పీ స్థాయి అధికారుల వరకు ఎటువంటి రాజకీయ జోక్యం ఉం డేది కాదు. దాంతో పోలీసులు స్వేచ్ఛగా, కొంతవరకు నిజాయితీగా పనిచేసేవాళ్లు.

కాని 1989 నుండి పరిస్థితులు మారుతూ వచ్చాయి. ఎన్టీఆర్ హయాంలో సమర్ధవంతులైన అధికారులకే పెద్దపీట వేస్తూ వస్తే, 1989లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఆ పద్ధతిని మార్చే సింది. అధికారపార్టీ అడుగులకు మడుగు లొత్తే అధికారులను అందలమెక్కించడం మొదలుపెట్టింది. పోలీసులంటే అధికార పార్టీ నియమించుకున్న ఏజెంట్లు అనే పరిస్థితికి తీసుకొచ్చింది. ఒక ఐపిఎస్ మంచి జిల్లాకు ఎస్పీగా పోవాలంటే సీఎం లేదా హోంమంత్రి దయాదాక్షిణ్యం కావాలి. వారి కనుసన్నలలో మెలగాలి. కానిస్టేబుల్ నుండి ఏఎస్పీ వరకు పోస్టింగ్‌ల కోసం జడ్పీటీసీలు మొదలుకొని మంత్రుల స్థాయి నాయకుల వరకు కాళ్లు గడ్డం పట్టుకోవాలి. అసలు ఈ రాజకీయ జోక్యం ఎంతవరకు పోయిందంటే పోస్టింగ్ కావా లంటే పోలీసులు సదరు ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫారసు లెటర్ తెచ్చుకోవాల్సిన స్థాయికి పోయింది. ఇలా సిఫారసు లెటర్‌తో బదిలీ అయి వచ్చిన పోలీసు అధికారి ప్రజలకు పనిచేస్తాడా? లేక తనను ఆ పోస్టింగ్‌లో నియమించిన ఎమ్మెల్యే లేదా మంత్రి సేవలో తరిస్తాడా? ఇప్పుడు పోలీసు వ్యవస్థలో ఇదే జరుగుతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే కాదు ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలోనూ పోలీసు వ్యవహారాలలో రాజకీయ జోక్యం పెరిగి పోతుంది. పోలీసులు, ఎస్‌ఐలు, సిసిఐలు, డిఎస్పీ స్థాయి అధికారులు మేలైన ప్రాంతాలలో పోస్టింగ్‌ల కోసమంటూ తెలుగుదేశం నాయకుల ఇళ్ళ చుట్టూ తిరుగుతున్నారు. వీళ్లంతా రేపు సిఫారసు లేఖలతో పోస్టింగ్‌లు తెచ్చుకుంటే సదరు రాజకీయ నాయకులకు ఊడిగం చేయా ల్సిందే! వాళ్లు చెప్పిన పోరంబోకు పను లన్నీ చేయాల్సిందే కదా!

నాయకులు ఐదేళ్లే పవర్‌లో వుం టారు. కాని పోలీస్ 60ఏళ్లొచ్చే దాకా పవర్‌లో వుంటాడు. ఉద్యోగ బాధ్యతలు తీసుకునేటప్పుడే ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా వృత్తిధర్మాన్ని నిర్వహించేందుకు సిద్ధపడి వుంటాడు. మరి అదే ధర్మాన్ని పాటిస్తే, ఎక్కడ పోస్టింగ్ ఇచ్చినా చిత్తశుద్ధితో పని చేయడానికి సిద్ధపడితే ఇలా ఆత్మగౌరవాన్ని రాజకీయ నాయకుల పాదాల వద్ద తాకట్టు పెట్టాల్సిన పని వుండదు కదా! పోలీసు రాజకీయ నాయకుడి గడప తొక్కితే తల మీదున్న టోపీపైగల మూడుసింహాల బొమ్మ తలవంచాల్సి వస్తుంది. అదే పోలీసు పైరవీలకు లొంగక తన ధర్మం తాను నిర్వర్తిస్తే టోపీ మీద వున్న మూడు సింహా లతో పాటు కనిపించని నాలుగో సింహం అతనే అవుతాడు.

## నెల్లూరు కార్పొరేషన్‌లో డబుల్ పవర్ పాయింట్లు





నెల్లూరు నగరపాలక సంస్థ మేయర్ పదవిని పట్టుబట్టి సాధించుకున్నాడు అబ్దుల్ అజీజ్. వ్యాపారరీత్యా బాగా స్థిరపడ్డాడు. ఆర్థికంగా లోటులేని మనిషి. కాబట్టి పదవిని అడ్డం పెట్టుకుని సంపాదించాలనే యావ ఉండకపోవచ్చు. కాని నెల్లూరు కార్పొరేషన్‌లో ఆయన ఒక్కడే ఇప్పుడు పవర్‌సెంటర్ కాదు. ఆయనకంటే ప్రధానమైన పవర్ సెంటర్‌గా మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ ఉన్నాడు. సొంత జిల్లా మంత్రి పురపాలకశాఖను నిర్వహిస్తుండడం ఆయనకు కొంత ఇబ్బందికరంగా మారుతుంది. ఎందుకంటే నెల్లూరు నగరపాలక సంస్థలో ఏటూ జడ్ మున్సిపల్‌మంత్రి కనుసన్నలలోనే జరిగే అవకాశముంది.


రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి అయినప్పటికి నారాయణ మిగిలిన జిల్లాల్లోని కార్పొరేషన్‌లు, మున్సిపాల్టీల వ్యవహారాలను నేరుగా పట్టించుకునే పరిస్థితి లేదు. సిబ్బంది నియామకాలు, బదిలీలు, నిధుల మంజూరు వంటి వాటిలో ఆయా జిల్లాల మంత్రులకు ఎమ్మెల్యేలకు, మేయర్లు, ఛైర్మెన్‌లకే ప్రాధాన్యత ఉంటుంది. కాని నెల్లూరు నగరపాలక సంస్థ కొచ్చేసరికి పరిస్థితి అది కాదు. నెల్లూరు కార్పొరేషన్ వ్యవహారాలను మంత్రే నేరుగా పర్యవేక్షించే అవకాశముంది. ఈ కార్పొరేషన్‌లో అధికారులు, సిబ్బంది అంతా కూడా మంత్రి ఇష్టానుసారమే నడుచుకుంటారు. అలాంటివారినే నియమించుకుంటారు. ఎందుకంటే మంత్రి సొంత కార్పొరేషన్ కాబట్టి దీనిపై పూర్తి పట్టు సాధించడానికి ఆయన ప్రయత్నించవచ్చు. అదీగాక ఇక్కడ మేయర్ వైకాపా కాబట్టి వారికి ప్రాధాన్యత తగ్గవచ్చు. ఆటోమేటిక్‌గా మంత్రి సారధ్యంలో కార్పొరేషన్‌లో ప్రతిపక్ష నేతకు కూడా ప్రాధాన్యత ఏర్పడే అవకాశముంది. మేయర్‌కు దీటుగా ప్రతిపక్షం కూడా ఇక్కడ అన్ని విషయాల్లో సమాంతర పాలనను కొనసాగించవచ్చు.

## నెల్లూరు జిల్లాపై... కక్ష చూపిస్తారా... పట్టు సాధిస్తారా?

***ఊరంతా ఒకదారైతే.. ఉలిపికట్టెది మరో దారి అన్నట్లుగా తయారైంది మన జిల్లా పరిస్థితి. ఇటీవల జరిగిన జిల్లా పరిషత్, నగరపాలక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో తెలుగుదేశం పార్టీ విజయకేతనం ఎగురవేస్తే నెల్లూరు జిల్లాలో మాత్రం ఆ విజయం వైఎస్సార్సీపి సొంతం కావడం జరిగింది. అది వైఎస్సార్సీపికి ఎంతో ఆనందాన్ని, టిడిపికి మాత్రం కొంత ఆవేదనను కలిగించింది.***

రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలో వున్నప్పటికీ ఇక్కడి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించలేకపోవడం టిడిపి నాయకుల మనసుకు కష్టం కలిగించే విషయంగా తయారైంది. పోనీ ఆ ఎన్నికలన్నా ప్రశాంతంగా జరిగాయా అంటే అదీ లేదు. ఇరు పార్టీలు విజయం కోసం నానా రాజకీయాలు చేసుకున్నాయి. ఎన్నిక వేళ కూడా అంతా రభసే. ఒకరకంగా చెప్పాలంటే యుద్ధవాతావరణమే అయ్యింది. నాయకుల బహిరంగ సవాళ్ళు, వాగ్యుద్ధాలు అబ్బో.. ఒకటేమిటి..రచ్చారావిళ్ళతో జిల్లా పేరు మారుమోగిపోయింది. ఎట్టకేలకు అటు నగరపాలక సంస్థలోనూ, చివరికి లక్కీ డిప్‌తో ఇటు జడ్పీలోనూ వైఎస్సార్సీపియే విజయం సాధించింది. అయితే, అటు జిల్లా అభివృద్ధికి, ఇటు నగరాభ్యున్నతికి మూలస్తంభాల్లాంటి ఈ రెండు సంస్థలూ వైఎస్సార్సీపీకే దక్కడం ఆ పార్టీకి వరమైనప్పటికీ, టిడిపికి మాత్రం లోలోపల వేదనగానే వుందన్న విషయం బహిరంగ రహస్యమే. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చక్రం తిప్పుతున్న నేటి పరిస్థితుల్లో జిల్లాలో వైఎస్సార్సీపి పెత్తనానికి అడుగడుగునా అడ్డుకట్టలు వేసి కక్ష చూపిస్తారా?..లేదా పార్టీలకు అతీతంగా ప్రగతి సాధించి ప్రజల మనసులను ఆకట్టుకుని, తద్వారా ఈ జిల్లాపై పట్టు సాధిస్తారా?.. అన్నది సర్వత్రా చర్చనీయాంశంగా వుంది. అసలే, కాంగ్రెస్‌పాలనలో జిల్లా పరిస్థితి అస్త వ్యస్తంగా మారింది. ఎంతో ప్రధానమైన వ్యవసాయరంగం సైతం సమస్యల వలయంలో పడి కుదేలైపోయింది. ఇక నగరం పరిస్థితి ఎంత అధ్వాన్నమో చెప్పలేం. ఏళ్ళు గడిచిపోతున్నా నగరం అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదు. ఎంతో ముఖ్యమైన డ్రైనేజీ వ్యవస్థే సక్రమంగా లేక, నగరం ఒక మురుగుగుంటగా, చెత్తకుప్పల నిలయంగా, దోమల పుట్టగా మారిపోతున్నా పట్టించుకున్న నాథులు లేరు. పక్కనే పెన్నానది వున్నా ప్రజలందరికీ పరిశుభ్రమైన మంచినీరు కరువే. నగరంలో ట్రాఫిక్ పరిస్థితి అంతా అబందరగా తయారైన దుస్థితి. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కూడా ఒక ప్రహసనంగా మారిందే తప్ప, ఆచరణాత్మక ప్రణాళికలు కానీ, నగరాభ్యున్నతికి అవసరమైన పథకాలు కానీ ఆలోచించిందీ లేదు..ఆచరించిందీ లేదు. నగరం నందనవనం చేస్తామనే మాట ఆర్భాటపు ప్రకటనలకే పనికొచ్చిందే తప్ప, ఆచరణలో నగరం అత్యంత అధ్వాన్నంగానే మారింది. అటు జిల్లా పరిస్థితిలో కానీ, నగర దుస్థితిలో కానీ అప్పటికీ ఇప్పటికీ ఎలాంటి మార్పులూ లేవు. సమస్యలన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్నట్లుగానే వున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎంతో కీలకమైన జడ్పీ, కార్పొరేషన్‌లు వైఎస్సార్సీపి వశం కావడంతో, అధికారపార్టీ అయిన తెలుగుదేశం అభివృద్ధికి సహకరిస్తుందా?..లేదా!..అన్నది అందరి మనసులనూ తొలిచివేస్తున్న ప్రశ్న. అయితే, రాజకీయాలను రాజకీయాలుగానే చూడాలే తప్ప, కక్ష సాధింపు ధోరణుల వల్ల సాధించేదేమీ వుండదనే విషయం విజ్ఞులు, విషయజ్ఞులైన నాయకులందరికీ తెలిసిందే. అందులోనూ ఎంతో అనుభవజ్ఞులైన టిడిపి నేతలకు ఈ విషయం ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాను, నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తే ప్రజలు ఎప్పటికీ అలాంటి పార్టీల పట్ల ఆదరంతోనే వుంటారన్నది అందరికీ తెలిసిందే. అదేవిధంగా, తాము స్థానికంగా అధికారంలో వున్నా, రాష్ట్రంలో అధికారంలో లేకపోవడం వల్ల తమకు ఎలాంటి పనులూ మంజూరు కావడం లేదని, అందువల్ల తాము ఏమీ చేయలేని దుస్థితిలో వున్నామని గెలిచిన పార్టీ కుంటిసాకులు చెప్తూ బేలతనం ప్రదర్శించడం వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ వుండదు. అధికారపార్టీ కూడా ఏవో కొన్ని స్థానాల్లో విజయం సాధించ లేకపోయినంత మాత్రాన ఆ ప్రాంతాలపై శీతకన్ను వేయాల్సిన అవసరంలేదు. అలా చేయడం మంచినేతల విజ్ఞత కూడా కాదు. అధికారంలోకి వచ్చాక, ప్రాంతమేదైనా ప్రజలంతా ఒక్కటే అనే దృక్పథంతో అన్ని ప్రాంతాల సమగ్రాభ్యున్నతే నేతల లక్ష్యం కావాలి. అదేవిధంగా, ఎన్నికల్లో జయాప జయాలను పక్కనపెట్టి ఎన్నికలయ్యాక అందరూ తిరిగి తమ ప్రాంతాభివృద్ధికి కంకణబద్ధులు కావడం, ప్రజాసంక్షేమం విషయంలో అందరూ కలసికట్టుగా వుండి, జిల్లాను ప్రగతిపథంలో నడి పించడం నాయకులందరి కర్తవ్యం కూడా. అందులోనూ ఇప్పుడు అటు కేంద్రంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ వున్న నేతలు అభివృద్ధి ప్రదాతలుగా శరవే గంగా రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్న నేపథ్యంలో, జిల్లాలోని నాయకులు కూడా జిల్లా అభివృద్ధిని కాంక్షిసూ ముందుకు సాగాలే తప్ప, విభేదాలు, మనస్పర్థలతో సాధించేదేమీ వుండదు. ప్రజాభ్యున్నతే ధ్యేయంగా ఒకరికొకరు సంయమనంతో సహకరించుకుంటూ, ప్రజలకు మేలైన పథకాలను అమలుచేయగలిగితే...మన నాయకులు కూడా అటు జిల్లాను, ఇటు నగరాన్నీ నిజంగానే సుందరనందనం చేయవచ్చు. చేయగలరు కూడా.

# ఓడినా వారిదే హవా!



***అధికార పార్టీ అయ్యుండాలే గాని గెలిచినా ఒకటే ఓడినా ఒకటే అన్నట్లుగా ఉన్నాయి జిల్లాలో పరిస్థితులు. వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచి కూడా లాభం లేదనుకుంటుంటే, తెలుగుదేశం తరపున పోటీ చేసి ఓడిపోయిన నాయకులు తమ హవాను చూపిస్తున్నారు. అధికారపార్టీలో పదవులు లేకుండానైనా ఉండేదానికి, ప్రతిపక్షంలో పదవులుండి ఉండేదానికి చాలా తేడా కనిపిస్తుంది.***

మొన్నటి ఎన్నికల్లో సర్వేపల్లి అసెంబ్లీ నుండి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గెలిచాడు. ఆయన చేతిలో తెలుగుదేశం అభ్యర్థిగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓడిపోయాడు. కాని ఈరోజు తెల్లారి లేచింది మొదలు చూస్తే అధికారికంగా ఎమ్మెల్యే అయిన కాకాణి ఇంటి వద్ద పురుగు ఉండడం లేదు. అదే సమయంలో ఆయన చేతిలో ఓడిపోయిన సోమిరెడ్డి ఇంటి వద్ద మాత్రం జనం దండిగా ఉంటున్నారు. సోమిరెడ్డి గెలిచి వుంటే మంత్రై ఉండేవాడు. అప్పుడింకా తిరునాల మాదిరిగా ఉండేది. అయినా ఇప్పుడు కూడా జనం ఆయనను మంత్రి లెవల్లో అనుకునే వస్తున్నారు. జిల్లా మొత్తం మీద మంత్రి నారాయణ కంటే కూడా సోమిరెడ్డే ఎక్కువుగా అందుబాటులో ఉంటుండడంతో నాయకులు, కార్యకర్తలు ఆయన వద్దకే ఎక్కువుగా వస్తున్నారు. ఆయా నియోజకవర్గాలలో చూస్తే గెలిచిన వైకాపా ఎమ్మెల్యేల కంటే ఓడిపోయిన తెలుగుదేశం అభ్యర్థులే ఎక్కువుగా అధికారాలు చెలాయిస్తున్నారు. అధికా రులు కూడా బదిలీల కోసం గాని, పనులు మంజూరుకు గాని వైకాపా ఎమ్మెల్యేల కంటే తెలుగుదేశం నాయకులనే ఎక్కువుగా సంప్రదిస్తున్నారు.

గూడూరులో బల్లి దుర్గాప్రసాద్, డాక్టర్ జ్యోత్స్నలత, సూళ్లూరుపేటలో వేనాటి రామచంద్రారెడ్డి, పరసారత్నం, నెల్లూరు నగరంలో ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, రూరల్‌లో సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి(బీజేపీ), ఆత్మకూరులో గూటూరు కన్నబాబు, కావలిలో బీద మస్తాన్‌రావులు అధికార పార్టీ హవా చూపిస్తున్నారు. గెలిచిన ఎమ్మె ల్యేలకంటే అధికారం అండ చూసుకుని వీళ్లు స్పీడ్‌గా ఉన్నారు.

అదే విధంగా నెల్లూరు ఎంపీగా గెలిచిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి కంటే కూడా తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి హుషా రుగా ఉండడం గమనార్హం.

## అభివృద్ధి కోసం
# కాలనీల సంఘాలు ఏర్పడాలి



సభలో మాట్లాడుతున్న నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

ఆయా కాలనీల అభివృద్ధి కోసం, కాలనీల సంఘాలు ఏర్పాటు చేసుకోవాలని, తద్వారా అభివృద్ధి పనులను వేగవంతం చేసుకోవాలని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ సూచించారు. జులై27న నెల్లూరులోని మాదాల చంద్రశేఖరం కల్యాణ మండపంలో శ్రీనివాస అగ్రహారం ఇళ్ళ యజమానుల సంఘంవారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నగరంలో ఇళ్ళ యజమానుల సంఘం ఏర్పాటు చేసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఎంతైనా అభినందనీయమని ఆయన అన్నారు. కాలనీల్లో పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తే, నగరం పరిశుభ్రంగా వుంటుందని, పచ్చదనంతో వెల్లివిరుస్తుందన్నారు. నగరంలో 15 వందల కోట్ల వ్యయంతో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, పారిశుద్ధ్యం, మంచినీటి వసతుల కల్పన తదితర కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి జరుగుతోందన్నారు. ప్రజలందరి సహకారంతోనే పారిశుద్ధ్యం వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి నేతాజీ స్కూల్ సుబ్బారెడ్డి అధ్యక్షత వహించారు. శ్రీనివాస అగ్రహారంలో డ్రైన్‌లు, కాలువలు ఏర్పాటు చేయాలని, వీధుల్లో ఇరువైపులా తాము పెంచుతున్న మొక్కలకు ట్రీగార్డ్స్ కావాలని, పలు వీధుల్లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటుచేయాలని, విజయమహల్ రైల్వే గేటు సెంటర్ వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్ నెలకొల్పాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి, మేయర్‌కి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ అజీజ్, 45వ వార్డు కార్పొరేటర్ పుట్టా హరిత తండ్రి పుట్టా రామకృష్ణారెడ్డి, జి.శ్రీనివాసులు రెడ్డి, పూండ్ల దయాకర్‌రెడ్డి, పి.లోకేశ్వరరావు, ఎం. చలపతిరావు, ఎం.భవాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతాజీ (ఎంఎస్ఆర్) పైలెట్ స్కూల్ విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను అందరినీ ఆకట్టుకున్నాయి.

# నెల్లూరు రూరల్‌లో అంతర్జాతీయస్థాయి స్టేడియం

**రూ.15వందల కోట్లతో ప్రతిపాదనలు**

నెల్లూరు రూరల్‌మండలంలోని మొగళ్లపాలెంలో అంతర్జాతీయస్థాయిలో స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ఆ మేరకు జిల్లా ఉన్నతాధికారులు తగు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.ఇక్కడ వున్న 150 ఎకరాల ప్రభుత్వస్థలంలో, దాదాపు 15 వందల కోట్ల రూపాయల వ్యయంతో స్టేడియం నిర్మించాలని, తద్వారా జిల్లాలో క్రీడాస్ఫూర్తిని మరింతగా పెంపొందించాలని భావిస్తున్నారు. ఆ మేరకు అవసరమైన నిధుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు, అభ్యర్థనలు పంపారు. జిల్లాలోని క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో మంచి నైపుణ్యంగల శిక్షణ అందించి మంచి క్రీడాకారులుగా రాణించేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. అందుకు అనువైనవిధంగా ఈ స్టేడియంను రూపొందించాలనే కృషి జరుగుతోంది. ఈ ప్రతిపాదనలు మంజూరై, స్టేడియం నిర్మాణం జరిగితే క్రీడారంగంలో మన జిల్లా మరింత ప్రతిభను సాధించి, జిల్లా కీర్తిని దశదిశలా చాటుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఆర్టీసీని లాభాల బాట పట్టిస్తా

**- ఇ.డి కోటేశ్వరరావు**

ఆర్టీసీ నెల్లూరు రీజియన్ ప్రస్తుతం నష్టాల్లో వుందని, దానిని లాభాల బాట పట్టించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ. కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించి తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, పరిపాలనా పరమైన చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి, ఆర్టీసీ ఆదాయాల బాటలో నడిచేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కోటేశ్వరరావును రీజనల్ మేనేజర్ ఎం. రవికుమార్ తదితరులు పుష్పగుచ్ఛాలతో స్వాగతించి, అభినందించారు.

# ఆటలకు చేయూతనివ్వండి

విక్రమ సింహపురి యూనివర్శిటీలో ప్రతి ఏటా నిర్వహించే క్రీడల విధానానికి స్పోర్ట్స్‌బోర్డులో ఆమోదం తెలపాలని కోరుతూ బుధవారం ఆ యూనివర్శిటీ ఫిజికల్ డైరెక్టర్ల సంఘంవారు వీఎస్‌యు వైస్ ఛాన్సలర్ వి. రాజారామిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ల సంఘం అధ్యక్షుడు ఎం.రవీంద్రబాబు మాట్లాడుతూ, 2014-15 సంవత్సరానికి నిర్వహించనున్న అంతర్‌కళాశాలల క్రీడాపోటీల నిర్వహణలో జిల్లాలోని అన్ని కళాశాలలకు అవకాశం కల్పించాలని కోరారు. క్రీడా నిర్వహణకు యూనివర్శిటీ అందజేసే సబ్సిడీ నగదును 25 శాతం మేరకు పెంపుదల చేయాలని, కిట్ అలవెన్స్‌ను కూడా పెంచాలని, అంతర్ విశ్వవిద్యాలయ క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు డిఏ పెంచాలని ఆ వినతిపత్రంలో విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థుల ప్రతిభను వెలికితీయాలి

**--- విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ ---**


వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, మేయర్ అజీజ్, జడ్పీ ఛైర్మెన్ రాఘవేంద్రరెడ్డి

విద్యార్థుల్లో వున్న నైపుణ్యాన్ని, సృజనాత్మక శక్తిని పరిశీలించి, వారి ప్రతిభను వెలికితీయాలని, విద్యార్థులను భావిభారత పౌరులుగా ఉత్తమ శ్రేణిలో తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ అన్నారు. బుధవారం నెల్లూరులోని సంతపేట సెయింట్ జోసఫ్స్ బాలికోన్నత పాఠశాలలో విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన వందలాదిమంది విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. దేశభక్తి, దేశసమగ్రత, మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం, వీధి బాలలు తదితర అంశాలపై ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ 656 మంది తమ ప్రయోగాల ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని, విద్యా రంగంలోనూ మంచి మార్పులు రావాలని అన్నారు. జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఎజెసి రాజ్‌కుమార్, డిఇఓ ఉష, సర్వశిక్షా అభియాన్ పి.ఓ కోదండరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెరుగుతున్న రిజిస్ట్రేషన్లు

పెంచిన భూముల విలువలు ఆగస్టు 1వ తేది నుంచి అమలులోకి రానుండడంతో బుధవారం నెల్లూరులోని రిజిస్ట్రేషన్ కార్యాలయం రిజిస్ట్రేషన్లు చేసుకునేవారితో రద్దీగా కనిపించింది. భూముల కొనుగోళ్ళు, అమ్మకందారులతో కార్యాలయం క్రిక్కిరిసిపోయింది. సాధారణ రోజుల్లో రోజుకు 50 దాకా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయని, అయితే గత మూడు రోజులుగా రోజుకు నూరుకు పైగా రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రిజిస్ట్రార్ మురళీకృష్ణ పేర్కొన్నారు. త్వరలో భూముల విలువ 5నుంచి 10 శాతం దాకా పెరిగే అవకాశం వుందని భావిస్తున్నారు.

## రేషన్‌షాపు డీలర్ల సంఘం
## జిల్లా అధ్యక్షునిగా గిరిజారావు

రేషన్‌షాపు డీలర్ల సంఘానికి కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక టౌన్‌హాలులో జరిగిన జిల్లా రేషన్‌షాపు డీలర్ల సర్వసభ్య సమావేశంలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా మునగా గిరిజారావు (నెల్లూరు), ప్రధాన కార్యదర్శిగా బి. మాల్యాద్రి (కొడవలూరు), కోశాధికారిగా వై. రవికుమార్ (ఎఎస్ పేట) ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా ఎస్.నాగరాజు (ఇందుకూరుపేట), ఉపాధ్యక్షులుగా పి.రత్నం మొదలియార్ (నాయుడుపేట), సంయుక్త కార్యదర్శిగా షేక్ అల్లాభక్షు (వింజమూరు), నిర్వహణా కార్యదర్శిగా డి.పరమేశ్‌కుమార్ (బుచ్చిరెడ్డిపాళెం)లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శాంతకుమారి, ఎఎస్ఓ శంకరన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, గౌరవాధ్యక్షులు జి.వెంకటేష్, కూరపాటి సుబ్బారావు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

# పిచ్చి పిచ్చి ఉద్యమాల్లో పాల్గొనేది లేదు

**- మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకా**



పిచ్చి పిచ్చి ఉద్యమాల్లో తాను పాల్గొనేది లేదని మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి అన్నారు. రైతు ఉద్యమానికి కాంగ్రెస్ పిలుపునిచ్చిందని, అయితే ఇప్పటి పరిస్థితుల్లో అలాంటి అనవసర నిర్ణయాలు పార్టీకి నష్టం కలిగిస్తాయని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు చాప చుట్టినట్లు చుట్టి సముద్రంలో పడేశారని ఆయన అంటూ, కాంగ్రెస్‌పార్టీ ఇప్పటికైనా తన తప్పులు సరిదిద్దుకోవాలని సూచించారు. తాను కాంగ్రెస్ వాదినని, కాంగ్రెస్‌లోనే వుంటానని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు నష్టాలు కలిగించే నిర్ణయాలను తాను వ్యతిరేకిస్తానన్నారు. ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చారని ఆయన విమర్శించారు. రుణమాఫీ విషయంలో ప్రజలకు అన్యాయం జరిగితే, అటువంటి విషయాలపై ఉద్యమం చేపట్టడం సమంచితంగానే వుంటుందని, అలాకాక లేనిపోని నిర్ణయాలు తీసుకున్నందువల్ల పార్టీకి నష్టమే తప్ప ప్రయోజనం వుండదని స్పష్టం చేశారు. ప్రజలకు చేరువయ్యేలా పార్టీ నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కాంగ్రెస్ నేతలకు సూచించారు.

# నెల్లూరుకు చోటు లేకపోవడం దారుణం

కేంద్రం మంజూరుచేసిన జాతీయ విద్యాసంస్థల ఏర్పాటులో నెల్లూరుజిల్లాకు చోటు దక్కకపోవడం ఈ జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఫ్యాక్స్ ద్వారా కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడుకు పంపిన వినతిపత్రంలో పేర్కొన్నారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, విశాఖ, విజయనగరం, ఉభయగోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలలో జాతీయ విద్యాసంస్థలను నెలకొల్పుతున్నట్లు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ ప్రకటించారని, ఆ జాబితాలో నెల్లూరు పేరు లేకపోవడం శోచనీయమన్నారు. జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుకు ఈ జిల్లాలో కావాల్సిన అన్ని వసతులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.


# అన్నమయ్య స్వరార్చన

శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి 606వ జయంతి సందర్భంగా ఈ నెల 2వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటలకు నెల్లూరు రాజీవ్‌రహదారి(మినీబైపాస్) లోని అన్నమయ్య విగ్రహ ప్రాంగణంలో 'అన్నమయ్య స్వరార్చన' జరుగనుంది. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీత కళాకారులచే సప్తగిరి సంకీర్తనలు, గోవిందనామస్మరణలు, భజనలు, కోలాటాలు నిర్వహించబడతాయి. ఆధ్యాత్మిక, సంగీత, సాహిత్యాభిమానులు, అన్నమయ్య భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ కోరుతుంది.



# రవాణాశాఖ దాడులు

రవాణాశాఖ ఆధ్వర్యంలో నగరంలో బుధవారం వాహనాలపై దాడులు నిర్వహించారు. ఎలాంటి ధృవపత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. 15 మోటార్ బైక్‌లను సీజ్ చేసి, 25 మోటార్‌బైక్‌లకు సంబంధించి కేసులు నమోదు చేశారు. అధిక లోడ్‌తో వెళ్తున్న పలు లారీలపై కేసులు నమోదు చేశారు. స్థానిక భక్తవత్సలనగర్‌లో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ మురళీమోహన్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. సహాయ మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ ప్రభాకరరావు, ఎం. రాములు తదితర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.




## ఆ శీర్షిక బాగుంది

18-7-14 సంచికలో 'ఆంధ్ర సీఎంను ఆపుతున్నదెవరు?' శీర్షిక బాగుంది. ఆలోచింపజేసే విధంగా ఉంది. 'లాయర్'లో రాజకీయ విశ్లేషణలు చాలా పదునుగా ఉంటున్నాయి. శీర్షికలతో పాటు విషయ సేకరణ, విశ్లేషణ పఠనీయంగా ఉంటున్నాయి. స్థానిక పత్రిక అయినప్పటికి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి సమగ్ర సమాచారాన్ని అందమైన ముద్రణతో అందిస్తున్న 'లాయర్' సిబ్బందికి అభినందనలు.

డాక్టర్ బీరం సుందరరావు, ఇంకొల్లు.

## ఏపిలో రెండు సామంత రాజ్యాలు

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ 11జిల్లాల్లో విజేతగా నిలిచినా కడప, నెల్లూరు జిల్లాలను కదిలించలేకపోయారు. కడప జగన్ సొంత జిల్లా కాబట్టి గెలిచారు. నెల్లూరుజిల్లాలో వైయస్ అభిమానులు అధికం. అధికార పార్టీ సర్వశక్తులు ఒడ్డినా అభిమానం, అదృష్టం, దైవబలం రాఘవేంద్రకి అండగా నిలిచాయి. అనవసరంగా బలం లేకున్నా అడ్డదారుల్లో జడ్పీ ఛైర్మెన్ పదవి కోసం ప్రయత్నించి తెలుగుదేశం పార్టీ భ్రష్టు పట్టింది.

జి.యస్.రెడ్డి, నెల్లూరు.

## మేయర్‌కు విజ్ఞప్తి

నెల్లూరు నగరంలో దోమల మోత ఎక్కువుగా ఉంది. నగర ప్రజలు వాటితో నరకయాతన అనుభవిస్తున్నారు. నగరంలో క్లీన్ అండ్ గ్రీన్‌పై మేయర్ ప్రత్యేకశ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా కాలువల్లో క్యారీబ్యాగ్స్ వేస్తున్నందువల్ల మురికి నిలిచిపోతుంది. దీంతో దోమలు భయంకరంగా పెరుగుతున్నాయి. వీటికి కారణమైన ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను నిషేధించాలి.

వీరిశెట్టి కార్తీక్, నెల్లూరు.

## చెత్తగా రోడ్లు

మినీబైపాస్‌లో వేసిన తారు రోడ్లు దారుణంగా ఉన్నాయి. పాత రోడ్లు శుద్ధంగా ఉండేవి. ఇప్పుడు వేసిన తారురోడ్డు ఎగుడుదిగుడులుగా ఉంది.

కృష్ణ.జె, నెల్లూరు.

# 'ప్రభా'తం

జులై నెల.. మెదక్‌జిల్లా మాసాయిపేటకే కాదు, తెలుగు ప్రజలందరికీ పెను విషాదాన్ని మిగిల్చిన అత్యంత దురదృష్టకర మాసంగా ముద్రవేసుకుంది. ఈ ఏడాదిలోనే ఇదొక నెత్తుటిమాసంగా నిలిచిపోయింది. బస్సులో బడికి వెళ్తున్న అభంశుభం తెలియని చిన్నారుల ప్రాణాలను పొట్టనబెట్టుకుని, వారి తల్లులకు గర్భశోకాన్నీ, తండ్రులకు తీరని గుండెకోతనూ మిగిల్చి ఇదో విషాద మాసంగా నిలిచిపోయింది.

ఎట్టకేలకు జులై వెళ్లిపోయింది.. తెలుగువారి గుండెల్ని నిలువునా కోసినంతగా బాధపెట్టి, ఎంతోమంది తల్లిదండ్రుల కన్నీళ్ళను ఆబగా తాగి.. మృత్యువు తన రక్తదాహం తీర్చుకుని.. తనకేమీ తెలియనట్లు నంగనాచిలా వెళ్ళిపోయింది. అయినా.. ఈ పెను విషాదాన్ని జీవితాంతం ఎలా భరించాలి?.. కంటిపాపలైన పిల్లలు.. ఇక లేరనే బాధను ఆ తల్లిదండ్రులు ఎంత కాలానికైనా ఎలా మరచిపోగలరు?.. వేగం తప్ప ఏ ఆర్తనాదం విన్పించుకోని కరుకు రాతిగుండె కలిగిన ఆ ఇనుపచక్రాల రైలు మాత్రం.. అంతమంది చిన్నారుల ప్రాణాల్ని చిదిమేసి తనపాటికి తాను వెళ్ళిపోయింది. కాలం కూడా ఆ విషాదాన్ని చూసి భరించలేక.. మౌనంగా తలదించుకుని కదిలిపోయింది. అల్లారుముద్దుగా పెంచుకుంటున్న తమ బిడ్డల దేహాలు తునాతునకలు కావడం చూసి.. తమ చిన్నారుల రుధిరధారలతో.. రక్తచారికలతో ముద్దముద్దయిన రైలు పట్టాలూ... అత్యంత భయానక భీభత్సకరమైన ఆ దుస్సంఘటన దృశ్యాలన్నీ కళ్ళల్లో అలాగే కన్నీటి గడ్డలా ఘనీభవించిపోయాయి. బిడ్డలు బడికి వెళ్తూ..మమ్మీ టాటా..డాడీ..బై బై అంటూ చిరునవ్వుతో చేతులూపి వెళ్ళిన ఆ దృశ్యం ఒకవైపు..అంతలోనే బడికి వెళ్ళిన ఆ బిడ్డ..నెత్తురుగడ్డగా మారి..విగతజీవిగా కనిపిస్తున్న దృశ్యం మరోవైపు..ఎలా భరించాలి ఇంతటి శోకాన్ని?..కన్ను మూసినా..తెరచినా ఆ దుర్ఘటనే కళ్ళ ముందు కదులుతూంటే, ఏడ్చి ఏడ్చి అలసిపోయిన ఆ తల్లిదండ్రుల గర్భశోకాన్ని ఎవరు ఆర్చగలరు..ఎవరు తీర్చగలరు?...మెదక్‌జిల్లా వెల్దుర్తి మండలంలోని మాసాయిపేట గ్రామ పరిసరాల్లో కాపలా లేని ఓ రైల్వే క్రాసింగ్ వద్ద జులై 24వ తేదీన జరిగిన ఘోరప్రమాదం.. ఈ ఏడాది విషాదాల్లోకెల్లా విషాదమై నిలచింది. తెలుగువారి గుండెలకు తీరని గాయం చేసింది. ఓ ప్రైవేటు పాఠశాలకు చెందిన ఆ బస్సులో చిన్నారులు బడికి వెళ్తుంటే, కాపలా లేని రైల్వే క్రాసింగ్ వద్ద దురదృష్టవశాత్తూ ఆ బస్సును రైలు ఢీకొన్న దుర్ఘటనలో 14 మంది బడిపిల్లలు బలైపోయారు. మరో 20 మంది చిన్నారులు రక్తసిక్తమైన దేహాలతో ఆసుపత్రుల పాలయ్యారు. వీరిలో పలువురి పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా వుంది. ఈ సంఘటనలో బస్సు డ్రైవర్ కూడా మరణించాడు. ఆ బస్సు డ్రైవర్ అలక్ష్యం..కాపలా లేని క్రాసింగ్ ఈ రెండూ ఈ దుర్ఘటనకు కారణాలుగా మారాయి. అయినా.. ఎంత ఘోరం?.. శాస్త్ర సాంకేతిక రంగాలు ప్రపంచవ్యాప్తంగా శరవేగంగా విస్తరిస్తున్న ఈ దశలో కూడా మనం ఇంకా రైల్వే క్రాసింగ్‌ల వద్ద గేట్లు నిర్మించుకోలేక, కనీసం కాపలా కూడా ఏర్పాటు చేసుకోలేని దుస్థితిలో వుండడం ఎంత దయనీయం?.. ఇదేనా మనం సాధిస్తున్న ప్రగతి?.. ఇంకా ఎక్కడున్నాం మనం?..భద్రత లేని జీవితాలు, ఏదో ఒక నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు బలిపెట్టుకోవడాలూ.. ఇలా ఎంతకాలం?.. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు మాత్రం అయ్యో!.. అంటూ వాపోవడం తప్ప, అప్పటికప్పుడు నామ మాత్రపు చర్యలు తీసుకోవడం తప్ప ఏం చేయగలుగుతున్నాం?.. ఎంత చేసినా ఆ చిన్నారుల ప్రాణాలను వెనక్కి తెచ్చి ఇవ్వగలమా?.. బిడ్డలను కోల్పోయి కంటికి మింటికీ ఏకధారగా రోదిస్తూ తల్లడిల్లిపోతున్న ఆ తల్లిదండ్రుల గర్భశోకాన్ని తీర్చగలమా?..బడికి వెళ్లే సంతోషంలో బస్సెక్కిన పిల్లలు, మార్గమధ్యంలోనే ఇలాంటి దుర్ఘటనకు గురై తునా తునకలైపోవడం ఎంత దారుణం?.. గతంలో కూడా ఇదే రైల్వే క్రాసింగ్ వద్ద పలు ప్రమాదాలు జరిగాయని, ప్రమాదాలను వెంటనే గుర్తించి ఈ రైల్వే క్రాసింగ్ వద్ద కాపలా ఏర్పాటు చేయాలని స్థానికులెంతగా మొరపెట్టుకున్నా రైల్వే శాఖ వారు ఆలకించకపోవడాన్ని ఏమని అర్థం చేసుకోవాలి?...ఇదే దుర్ఘటనలో ముగ్గురు బిడ్డలను కోల్పోయిన ఓ కన్నతండ్రి గుండెపోటుకు గురయ్యాడు. దుర్ఘటనకు గురైన మరికొంతమంది పిల్లలు ఇంకా విషమపరిస్థితుల మధ్య ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతూనే వున్నారు. సుమారు నూట అర్వై ఏళ్ళ చరిత్ర కలిగిన భారతీయ రైల్వే వ్యవస్థ ఇంకా ఇలా తప్పటడుగులు, తప్పుటడుగులు వేస్తూండడం ఎంతో విచారకరమైన విషయం. దేశవ్యాప్తంగా నేటికీ వేలాది రైల్వే క్రాసింగ్‌ల వద్ద కాపలా లేదు.. భద్రత లేదు. అనేక చోట్ల తెలిసో తెలియకో రైల్వే పట్టాలు దాటుతూ ప్రమాదాలకు గురై ఎంతో మంది మృత్యువాత పడుతూనే వున్నారు. అనేక ప్రమాదాలు ఇలా రైల్వే క్రాసింగ్‌ల పరిసరాల్లోనే జరుగుతున్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అయినా, ఇంత జరుగుతున్నా రైల్వేశాఖ పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోకపోవవడం, రైల్వే క్రాసింగ్‌లు ప్రమాదస్థావరాలుగా, మృత్యువు పొంచివుండే స్థానాలుగా మారిపోతుండడం శోచనీయం. దేశంలో అత్యంత వేగవంతమైన, అధునాతనమైన బుల్లెట్ రైళ్ళ రాకకు ఒకవైపు కృషి జరుగుతుంటే, ఇంకా రైల్వే క్రాసింగ్‌ల వద్ద కనీసభద్రత లేక ఇలాంటి దురదృష్టకర సంఘ టనలు జరుగుతూనే వుండడం ఎంతో విచారకరం.

ఇకనైనా అలక్ష్యాన్ని వీడాలి.ప్రజల ప్రాణాల భద్రతకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత గట్టి చర్యలు తీసుకోవాలి. దేశంలో ఇక ఏ తల్లి తండ్రీ ఇలాంటి దుర్ఘటనలతో కన్నీరు పెట్టని విధంగా, ఇలాంటి దురదృష్టకర సంఘటనలు ఇక ఏనాటికీ తిరిగి జరగని విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నదే అందరి ఆకాంక్ష!..



## పెను విషాదం

*మెదక్‌జిల్లా వెల్దుర్తి మండలంలోని మాసాయిపేట గ్రామ పరిసరాల్లో కాపలా లేని ఓ రైల్వే క్రాసింగ్ వద్ద జులై 24వ తేదిన జరిగిన ఘోరప్రమాదం.. ఈ ఏడాది విషాదాల్లోకెల్లా విషాదమై నిలచింది. తెలుగువారి గుండెలకు తీరని గాయం చేసింది.*

# 'అంతర్'జాతీయం

- కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి(సిబిడిటి)కి నూతన ఛైర్మెన్‌గా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి కె.వి.చౌదరిని నియమించనున్నారు. కృష్ణాజిల్లాకు చెందిన ఆయన ప్రస్తుతం ఇదే మండలిలో సభ్యులుగా ఉన్నారు.
- ఉక్రెయిన్‌లో ప్రభుత్వ బలగాలను లక్ష్యంగా చేసుకుని ఆ దేశ భూభాగంపైకి రష్యా శత్రుఘ్నులను ప్రయోగించిందని అమెరికా ఆరోపించింది. తన వాదనకు మద్దతుగా ఉపగ్రహ చిత్రాలను కూడా విడుదల చేసింది.
- భారత పౌర అణుకేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లపై అణుఇంధన సంస్థ తనిఖీలకు సంబంధించిన అదనపు ప్రోటోకాల్ అమలులోకి వచ్చింది. భారత్-అమెరికా అణు ఒప్పందం ప్రకారం తనిఖీలకు అంగీకరిస్తూ 20అణుకేంద్రాల జాబితాను భారత్ ఇప్పటికే అంతర్జాతీయ అణుఇంధన సంస్థకు అందజేసింది.
- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వీసా వివాదాన్ని ముగిసిన అధ్యాయంగా అమెరికా ఉన్నతాధికారి నిషాద్‌శాయ్ బిస్వాల్ వ్యాఖ్యానించారు. మోడీని సెప్టెంబర్‌లో వాషింగ్టన్‌కు ఆహ్వానించేందుకు ఒబామా పరిపాలనా విభాగం ఎదురుచూస్తుందని ఆయన పేర్కొన్నారు.
- పోలియో నివారణకు ఉద్దేశించిన 'ఇంజక్టబుల్ ఇనాక్టివేటెడ్ పోలియో వ్యాక్సిన్'ను త్వరలో టీకా కార్యక్రమంలో చేరుస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ తెలిపారు.
- గంగానది ప్రక్షాళనకు ప్రధాని మోడీ తీసుకుంటున్న చర్యల్లో పాలు పంచుకునేందుకు ఆర్మీ ముందుకొచ్చింది. గంగానది పునర్వైభవ కార్యక్రమంలో సహాయపడేందుకు విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ ఆధ్వర్యంలో పనిచేసే 40మంది అధికారుల టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుకు ఆర్మీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.
- ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్షుడు హమీద్‌కర్జాయ్‌కు వరుసకు సోదరుడైన హస్మత్ ఖలీల్ కర్జాయ్‌ను ఒక ఆత్మాహుతి బాంబర్ హత్య చేసాడు. రంజాన్‌రోజు శుభాకాంక్షలు చెప్పే నెపంతో హస్మత్ ఇంటికి వచ్చిన ఉగ్రవాది ఆత్మాహుతి దాడికి పాల్పడ్డాడు.
- ఆదివారం ఖాట్మండ్‌కు వెళ్లనున్న భారత ప్రధాని నరేంద్రమోడీకి నేపాల్ ప్రధాని సుశీల్‌కోయిరాలా స్వయంగా వెళ్ళి స్వాగతం పలుకనున్నారు. ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి ఆయన స్వయంగా విమానాశ్రయానికి వెళ్ళనున్నారు.

# వార్త - వ్యాఖ్య

వార్త :- రెండో రాజధాని సాధ్యం కాదు. - మంత్రి పి.నారాయణ.
**వ్యాఖ్య :- *ముందు ఒక రాజధాని సంగతి చూడండి.***

వార్త :- ప్రభుత్వ పనుల్లో వేగం, నాణ్యత పెరగాలి. - కేంద్రమంత్రి వెంకయ్య.
**వ్యాఖ్య :- *ప్రభుత్వం నుండి అటువంటివి ఎవరూ ఆశించరులేండి.***

వార్త :- భాజపాలోనే మహిళలకు పెద్దపీట. - అమిత్‌షా.
**వ్యాఖ్య :- *పీటను ప్రత్యేకంగా చేయించారా?***

వార్త :- 4రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయం.- ఆమ్ ఆద్మీ ప్రకటన.
**వ్యాఖ్య :- *చేసి గెలిచిన రాష్ట్రంలో పొడిచిందేమీ లేదు కాబట్టా?***

వార్త :- రాజధాని నిర్మాణంలో భాగస్వాములమవుదాం. - మాలమహానాడు అధ్యక్షుడు కారెం శివాజీ.
**వ్యాఖ్య :- *భవన నిర్మాణాలకు రాళ్లెత్తుతారా?***

వార్త :- 'కొలిమి' సినిమాకు కేసీఆర్ పాటలు.
**వ్యాఖ్య :- *మాటలే మంటలు రేపుతుంటే, పాటలు ఇంకెంత రెచ్చగొడతాయో?***

వార్త :- రాజధాని నిర్మాణం పేరుతో గందరగోళం. - పీసీసీ అధ్యక్షుడు రఘువీరా.
**వ్యాఖ్య :- *ఈ ప్రభుత్వానికి రాజధాని నిర్మాణం ఒక్కటే పనిలా వుంది.***

వార్త :- ఐదేళ్ళలో కరువు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *ముందు పరిపాలన వున్న రాష్ట్రంగా చేయండి.***

వార్త :- రానున్న రోజుల్లో మంచి వానలు. - కేంద్ర వ్యవసాయ మంత్రి వెల్లడి.
**వ్యాఖ్య :- *ముందుంది మంచి కాలమంటారు.***

వార్త :- రేషన్‌కు ఆధార్ అనుసంధానం. - మంత్రి సునీత.
**వ్యాఖ్య :- *అంటే కోత పెట్టడమేగా!***

వార్త :- పదవులొస్తున్నాయహో! - నామినేటెడ్ పదవుల భర్తీకి చంద్రబాబు నిర్ణయం.
**వ్యాఖ్య :- *ఇంటింటికి ఉద్యోగం బదులు పదవులిస్తారేమో!***

# పెరుగుట..ఇంకా పెరుగుట కొరకే!

- భగ్గుమంటున్న కూరగాయల ధరలు
- లబోదిబోమంటున్న ప్రజలు
- ధరల నియంత్రణకు చర్యలు ఏవీ?



పెరుగుట విరుగుట కొరకే... అన్నది పాత సామెత. కూరగాయల ధరల విషయంలో అది మినహాయింపా అనిపిస్తోంది. ఏరోజుకారోజు విపరీతంగా పెరుగుతున్న ధరలను చూస్తే.. పెరుగుట ఇంకా ఇంకా పెరుగుట కొరకేనా... అన్నట్లుంది. ఇటీవల నెల్లూరు నగరంలోని పలు కూరగాయల రీటైల్ దుకాణాల్లో ధరలు చూస్తే నిజంగానే హడలిపోవాల్సి వస్తోంది. కూరల్లోకి ఎంతో అవసరమైన టమోటాల ధర కిలో 50 రూపాయలు పలుకుతోంది. వంకాయలు, బెండకాయలు, కాకరకాయలు అన్నీ చేదెక్కిపోయాయి. వీటి ధర కిలో 40 రూపాయలైంది. గోరుచిక్కుళ్ళు ధర 40 రూపాయలు పలుకుంతుటే, పందిరిచిక్కుళ్ళు ధర తాము అంతకంటే గొప్పేనంటూ కిలో 60రూపాయలు పలుకుతున్నాయి. ఇక పేదప్రజలు ఎంతో ఇష్టంగా కొనుగోలు చేసే దొండకాయలు, చేమగడ్డల వంటివి కూడా కిలో 30రూపాయలు పైగా చెప్తుంటే, ఇక ఏ కూరలు కొనాలి. ఇంతింత ధరలు పెట్టి పిల్లాపాపలను ఎలా పోషించుకోవాలి?.. అంటూ నిరుపేదలు ఆవేదన చెందుతున్నారు. అంతే కాదు, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే బీన్స్, క్యారెట్ వంటి ధరలు చూస్తే ఇంకా హడలిపోవాల్సి వస్తోంది. బీన్స్ ధర కిలో 80 రూపాయలు పలుకుతుంటే, క్యారెట్ 60 రూపాయలు పలుకుతోంది. కిలో బీట్‌రూట్ ధర 50 రూపాయలు. ఇంతగా భగ్గుమంటున్న ఈ ధరలను చూసి పేద, మధ్య తరగతి గృహిణులు ఇక మనం కూరగాయలను కొనగలమా?.. తినగలమా?.. అని వాపోతున్నారు. పాలకులు మారుతున్నా, ప్రభుత్వాలు మారుతున్నా, అధికారులు ఎందరో వస్తూ పోతున్నా ఈ ధరల తీరు మాత్రం మారడం లేదు. మారడం అంటూ జరిగితే ఇంకా పెరగడమే తప్ప, తగ్గడం అనే మాటే వినిపించడం లేదు. ఒకవేళ అధికారులు ఎప్పుడైనా ఈ ధరల మీద దృష్టి సారించినా, కొన్ని రకాల కూరగాయలను రైతు బజార్లలో కాస్తంత తక్కువ ధరకు ఇచ్చే ఏర్పాట్లు చేసినా, అది కొద్దిరోజులకే పరిమితమవుతోంది. అంతేకాదు, ప్రజలందరికీ అవి అందుబాటులో వుండడం లేదు. కూరగాయలు, నిత్యావసర వస్తువులు ఏ దుకాణాల్లో, ఏ ప్రాంతాల్లో అమ్మకాలు సాగించినా, నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఒకే నిర్ణీత ధరకే విక్రయించే ఏర్పాట్లు చేయగలిగితే ప్రజలకు కొంత వెసులుబాటు వుంటుంది. కోడిగుడ్ల ధరల లాగా, ఏరోజుకారోజు ఒకే నిర్ణీత ధర వుండాలి. ఆ ధర ప్రజలందరికీ తెలిసేవిధంగా ఏర్పాట్లు చేయాలి. ప్రతి దుకాణం వద్ద ధరల సూచికలు పెట్టాలి. ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులో వుండేందుకు ప్రతిరోజూ నిర్ధిష్టమైన చర్యలు తీసుకోవాలి. అందుకోసం ఒక అధికార వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఏరోజు ధరలను ఆరోజు అధికారులు బేరీజు వేసి, దుకాణదారులతో ఎప్పటికప్పుడు సమీక్షలు, సంప్రదింపులు జరుపుతూ వీలైనంత తక్కువ ధరకు కూరగాయలు, నిత్యావసర వస్తువులు ప్రజలకు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోగలిగితే కొంతైనా మార్పు జరుగుతుంది. లేదా, మరింకేదైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారానైనా ప్రజలకు అందుబాటులో వుండే ధరలకు కూరగాయలను అందించగలిగితే మంచిది. ఇలాంటివన్నీ, సంబంధిత దుకాణాల వ్యాపారులు, మార్కెట్ల నిర్వాహకులు, వ్యాపారనిపుణులు, అధికారుల బృందాలు అంతా కలసి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అసలు ఎలాంటి కసరత్తు లేకుండా, ధరలెంతగా పెరుగుతున్నా మనకేముందిలే అనే విధంగా, కొనేవాడు కొంటాడు.. లేనివాడు ఊరుకుంటాడు.. మనకెందుకు?.. అనే ధోరణితో వుండడం ఎంతవరకు సమంజసమో అందరూ ఆలోచించాలి. ఇకనైనా, ప్రజాసంక్షేమం దృష్ట్యా..నిత్యం మార్కెట్ ధరలను పరిశీలించి, సమీక్షించేందుకు సంబంధిత రంగాల్లోని నిపుణులు, అధికారులతో కూడిన బృందాలను శాశ్వత ప్రాతిపదికపై నియమించాలి. కూరగాయలు లేదా ఇతరత్రా నిత్యావసర సరుకులు ఏ ప్రాంతం నుంచి ఏ ధరకు ఇక్కడకు వస్తున్నాయో అనునిత్యం పరిశీలించాలి. వ్యాపారుల సంక్షేమాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని, వీలైనంత సరసమైన ధరలకు ప్రజలందరికీ అందుబాటులో వుండేలా ధరలను నిర్ణయించాలి. ఇతర ప్రాంతాల్లోని ఆయా వ్యాపారులతో కూడా అధికారబృందాలు ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతూ వుంటే కొంతమేరకు ధరలను నియంత్రించేందుకు వీలు వుంటుంది. మనసుండాలే కానీ, మార్గం లేకుండా పోదు. కూరగాయలు, నిత్యావసర సరుకులను వీలైనంత తక్కువ ధరలకు ప్రజలకు అందించేందుకు అనువైన మార్గాలన్నిటినీ అన్వేషించాలి. జిల్లా ఉన్నతాధికారులు, నిపుణుల బృందాలు, వ్యాపారుల సంఘాలు అందరూ సంయుక్తంగా ఆలోచించి, తగు విధాన నిర్ణయాలు తీసుకోగలిగితే, ధరల అదుపునకు మార్గాలు దొరకకపోవు. అయితే, అందుకు కావాల్సిందల్లా చిత్తశుద్ధి, ఆచరణాత్మక విధానాలు మాత్రమే. మార్కెట్‌కు వెళ్ళి కూరగాయలు కొందామనుకుని, ఆకాశాన్నంటిన ఆ ధరలను చూసి.. కిలో కొందామనుకున్న వారు పావుకిలోకే పరిమితమై, నిత్యం ఎంతో మంది ప్రజలు నిరాశగా తిరుగుముఖం పడుతుండడం ఎంత బాధాకరం!... ఇకనైనా ఈ దుస్థితి మారాలి..అందుకు కేవలం అధికారులే కాదు, ఆయా వ్యాపారవర్గాల వారూ, వ్యాపారరంగ నిపుణులు అందరూ తమవంతు సహకారం అందించి, ధరల నియంత్రణకు చొరవ చూపితే..వ్యాపారాభివృద్ధితో పాటు, ప్రజల ముఖాల్లో చిరునవ్వులనూ కూడా చూడవచ్చు. ఏమంటారు?...

# కన్నులపండువగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

## --- జ్ఞాపకాల దొంతరలో వెల్లివిరిసిన ఆత్మీయత ---

ఎప్పుడో పాఠశాలలో కలసి చదువుకున్న జ్ఞాపకాల దొంతర మధ్య, ఆత్మీయతాను రాగాల మధ్య ఆ పూర్వ విద్యార్థులంతా అపూర్వస్నేహానుభూతిని మళ్ళీ పంచుకున్నారు. 1988-91 సంవత్సరాల మధ్యలో ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు మళ్ళీ ఒకసారి అక్కడికి వచ్చి, తాము అప్పుడు చదువుకున్నప్పటి ముచ్చట్లను, అప్పటి అనుభూతులను ఎంతో ఆనందంగా ఒకరికొకరు చెప్పుకుని సంబరపడిపోయారు. నెల్లూరు రూరల్‌మండలంలోని నారాయణరెడ్డిపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జులై నెల 26 న జరిగిన ఈ ఆత్మీయ సమ్మేళనం పూర్వ విద్యార్థులతో కళకళలాడింది. ఈ సందర్భంగా అప్పట్లో తమకు పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి తమ ఆత్మీయతను చాటుకున్నారు. తాము చదువుకున్న ఈ పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామని పలువురు పూర్వవిద్యార్థులు తెలిపారు. టెన్త్‌లో ఉన్నత శ్రేణిలోఉత్తీర్ణులైన విద్యార్థులకు నగదు బహుమతులు అందించి ప్రోత్సహమిస్తామన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున పాఠశాలకు అవసరమైన సామగ్రిని, మంచినీటి వసతులను, మరుగుదొడ్ల సౌకర్యాలను కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఆత్మీయ కార్యక్రమానికి విదేశాల్లో వున్న ఈ పాఠశాల పూర్వవిద్యార్థులు కూడా కొందరు హాజరుకావడం విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయిని సులోచన, పూర్వ ఉపాధ్యాయులు శాంతకుమారి, సౌజన్య, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు. ఏదేమైనా పాఠశాల పూర్వ విద్యార్థులంతా కలసి ఇలాంటి సమ్మేళనం ఏర్పాటు చేసుకుని, అందరూ ఒకరికొకరు ఆత్మీయతను, స్నేహానురాగాలను పంచుకోవడం, పాఠశాల అభ్యున్నతికి సహకారం అందించాలని నిర్ణయించుకోవడం ఎంతో అభినందనీయం.

# చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

*- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కనకదుర్గారావు*


పారా లీగల్ వాలెంటీర్లు ప్రజలకు చట్టాలపై అవగాహన పెంపొందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ ఛైర్మెన్ సిహెచ్ కనకదుర్గారావు సూచించారు. జులై నెల 26న నెల్లూరులోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో జరిగిన పారా లీగల్ వాలంటీర్ల శిక్షణ కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి పాల్గొని, వారికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. దైనందిన జీవితంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలకు న్యాయపరంగా తగు పరిష్కార మార్గాలను చూపాలని, ప్రజలు అసాంఘిక శక్తుల బారినపడకుండా చూడాలని ఆయన వారికి సూచించారు. గృహహింస చట్టంతో పాటు, మహిళా చట్టాలు దుర్వినియోగం కాకుండా జాగ్రత్త వహించాలని, పారా లీగల్ వాలంటీర్లు చట్టాలపై అవగాహన పెంచుకుని, ప్రజలకు మేలు కలిగేలా ఆ చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా న్యాయసేవ సహాయకుల కరదీపికలను పారా లీగల్ వాలెంటీర్లకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎం. రామకృష్ణారెడ్డి, సభ్యులు సి. రంగనాథం, ఇవిఎస్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మృతులకు సంతాపం

నెల్లూరు జిల్లా ముస్లీం సేవా కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మెదక్ జిల్లాలో మరణించిన పసిపిల్లల తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ పిల్లల ఆత్మకు శాంతి చేకూరాలని దువాచేసి గతనెల 25న పొర్లుకట్ట సెంటర్‌లోని పేదవారికి బియ్యం, సేమియా, చక్కెర ఉచితంగా పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో ముస్లీం యూత్ సేవా కమిటీ అధ్యక్షులు ఎస్.కె.ఖాలీద్ మాట్లాడుతూ ఈ రంజాన్ నెలలో ఒక్కసారి సహాయంచేస్తే 70సార్లు చేసినట్లని అందువలన అందరూ వీలయినంత వరకు సహాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఎమ్.డి.ఖలీల్, గోల్డ్‌స్మిత్ ఎజాజ్, మాషా అల్లా క్యాటరింగ్ ఇస్సాక్, కె.డి.ఎన్.ఫ్రూట్స్ మున్నా, ఉపాధ్యక్షుడు అల్తాఫ్, ఫజల్, మైను, సికిందర్, మున్వర్ రౌషన్ తదితరులు పాల్గొన్నారు.


కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు

## శ్రద్ధాంజలి

మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాంతరాలలో వెలిగే ధృవతార
మా అభివృద్ధికి కారకులు, అనురాగంతో మమ్మల్ని
తన గుండెలలో దాచుకున్న ప్రేమమయుడు
మా తండ్రి కీ॥శే॥ మాగుంట రాఘవరెడ్డి గారు.
01-08-2014 శుక్రవారం ఆ మహనీయుని 37వ వర్ధంతి సందర్భంగా
వారి పవిత్రాత్మకు మా శ్రద్ధాంజలి.

కుమారులు
మాగుంట సుధాకర్‌రెడ్డి
మాగుంట శ్రీనివాసులురెడ్డి

మనుమడు
మాగుంట విజయారెడ్డి


గోసు గోపాలయ్యతో కమిటీ సభ్యులు

## గాండ్ల తెలికుల సంఘం
# రాష్ట్ర కన్వీనర్‌గా మురళీకృష్ణ గోపాలయ్య

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గాండ్ల, తెలికుల సంఘం తాత్కాలిక కమిటీ కన్వీనర్‌గా మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్యను ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13జిల్లాల గాండ్ల, తెలికుల ప్రతినిధుల సమావేశం సోమవారం నెల్లూరులోని పరమేశ్వరి, మహేశ్వరి కల్యాణ మండపంలో జరిగింది. విభజన నేపథ్యంలో సీమాంధ్రకు కొత్త కమిటీని ఎన్నుకోవాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ సభలో 20మంది సభ్యులతో కూడిన తాత్కాలిక కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. త్వరలో పూర్తిస్థాయి శాశ్వత కమిటీని నియమించి గాండ్ల, తెలికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఈ సందర్భంగా కన్వీనర్‌గా బాధ్యతలుచేపట్టిన గోపాలయ్య తెలిపారు.

## నెల్లూరు కబుర్లు

# ఆగష్టులో రాజధాని కమిటీ!

నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని ఎంపిక కోసం కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిటీ ఈ నెలలోనే జిల్లాలో పర్యటించే అవకాశముంది. ఈ కమిటీ ఇప్పటికే రాష్ట్రంలో పలు జిల్లాల్లో పర్యటించింది. రాజధానికి అనువైన అంశాలను పరిశీలించింది. ఈ నెలలో నెల్లూరుజిల్లాలో కూడా పర్యటించనుంది. కావలి, నెల్లూరు మధ్య, వెంకటగిరి – ఏర్పేడుల మధ్య వున్న ప్రభుత్వ భూములను ఈ కమిటీ పరిశీలించే అవకాశముంది. ఓ పక్క చంద్రబాబు గుంటూరు, విజయవాడ మధ్యే రాజధాని అని అంటుండగా ఈ కమిటీ ఇన్ని జిల్లాలు తిరిగినా ఇక లాభం ఏముంటుంది?

# ద్వారకాకు ఆర్యవైశ్య సంఘాల సత్కారం



నెల్లూరులోని ఆర్య వైశ్య సీనియర్ సిటిజన్ అసోసియేషన్ నిర్వహణలో జూలై 27న నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే కరూర్ వైశ్యా బ్యాంకు సీనియర్ మేనేజర్ పార్థసారధిని గౌరవంగా సన్మానించారు. కార్యక్రమంలో బి.వి.రమణయ్య, ఎన్.వి.కృష్ణయ్య, కె.ప్రేమచందర్, డాక్టర్ కిరణ్‌కుమార్, బి.వి.నరసింహం, మెంటా నరసింహారావు, కృష్ణమూర్తి, హనుమంతరావు, బాబూరావు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ ఆర్యవైశ్య సంఘాలకు కృతజ్ఞతలు తెలుపుతూ నగరాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తానని, ఆర్యవైశ్య సోదరులకు వెన్నుదన్నుగా నిలుస్తానని పేర్కొన్నారు.

# రక్తదానమే ప్రాణదానం




రక్తదానమే ప్రాణదానమని, రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలు నిలబెట్ట వచ్చని, రక్తదానం చేసే దాతలే ప్రత్యక్ష దైవాలని బ్లడ్‌బ్యాంక్ కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ అన్నారు. గత నెల 26న నెల్లూరు మినీబైపాస్‌లోని జోయలుకాస్‌లో రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. 31 మంది రక్తదాతలు పాల్గొని రెడ్‌క్రాస్ రక్తనిధికి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఈదూరు సుధాకర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ శ్రీకాంత్ ప్రత్యేక పర్యవేక్షణలో రక్తనిధి సేవలు అందరికీ అందుబాటులో వున్నాయన్నారు. రక్తదానం స్వచ్ఛందంగా చేయాలే తప్ప, బలవంతపు రక్తసేకరణ చేయకూడదన్నారు. రక్తదానం విశిష్టతను తెలియజేసి, యువతను రక్తదానం పట్ల చైతన్యపరచడం ధ్యేయంగా రెడ్‌క్రాస్ రక్తనిధి కృషిచేస్తోందన్నారు. రక్తదానమంటే ప్రాణదానమని, రక్తదాతలు ప్రత్యక్ష దైవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.పెంచల సుబ్బయ్య, మోటివేటర్ మదనపల్లి మధుసూదనరావు, స్టాఫ్ నర్స్ శ్రీమతి ఎ. కృష్ణవేణి, టెక్నీషియన్ డి. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## మహాభారత వైశిష్ట్యాన్ని తెలియజేసిన...
# పద్యకళాపరిషత్ ఉపన్యాసాలు


సత్కారాన్నందుకుంటున్న బ్రహ్మశ్రీ కోట వెంకట లక్ష్మీనరసింహం

నెల్లూరులోని పద్యకళాపరిషత్ ఆధ్వర్యంలో గత నెల 23 నుంచి 26వ తేది వరకు టౌన్‌హాలులో ఏర్పాటుచేసిన మహాభారత ఉపన్యాసాల కార్యక్రమాలు ఎంతో ఘనంగా జరిగాయి. భారత ఇతిహాసమైన మహాభారత వైశిష్ట్యాన్ని ఈ సభలో అవధాన రాజహంస బిరుదాంకితులైన తణుకుకు చెందిన బ్రహ్మశ్రీ కోట వేంకటలక్ష్మీనరసింహం మరింత సరళమైన రీతిలో అందరికీ అర్థమయ్యేలా వివరించి, స్థానిక ప్రముఖుల నుంచి సత్కారం అందుకున్నారు. ఈ ఉపన్యాసాల సందర్భంగా ఆయన మహాభారతంలోని ఎన్నో అంశాలను విశదీకరించారు. మహాభారతం ఎంతో అద్భుతమైన, విశిష్టమైన గ్రంథమన్నారు. మహాభారతాన్ని వినడం ద్వారా సమాజంలో మానవత్వం పెంపొందుతుందని, విశ్వమానవ ప్రేమ పరిఢవిల్లుతుందని అన్నారు. నేటి సమాజానికి కూడా మహాభారతం ఒక దిక్సూచి వంటిదన్నారు. ఎన్నో రకాల సమస్యలకు మహాభారతం ఒక పరిష్కారమవుతుందని ఆయన సూచించారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ ఉపన్యాసాల్లో మహాభారతంలోని శాంతిపర్వం తృతీయ, చతుర్థ, పంచమ, షష్ఠాశ్వాసాలను ఆయన కూలంకుషంగా వివరించారు.

ఈ సందర్భంగా పద్యకళాపరిషత్ నిర్వాహకులు మెట్టు రామచంద్రప్రసాద్, నలబోలు బలరామయ్యనాయుడు, బివి నరసింహం, చీమకుర్తి వేంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ఉపన్యాసకులైన బ్రహ్మశ్రీ కోట వేంకటలక్ష్మీనరసింహంను ఘనంగా సత్కరించారు. ఈ నాలుగు రోజుల కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు, సారస్వత వేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు. సభాపోషకులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త గుర్రం బాబయ్య, అచ్యుత సుబ్రహ్మణ్యం, శుభమస్తు అధినేత బివి రమణయ్య, సమాజసేవాపరాయణులు పాబోలు రామసుబ్బయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమాల్లో విశిష్ట అతిథులుగా జెవిస్ రెడ్డి, అల్లు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాల్లో భాగంగా, బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన ప్రముఖ కవి కొర్రపాటి వెంకటరమణయ్య రచించిన 'భారతంలో నీతి కథలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఏదేమైనా ఈ నాలుగు రోజుల పాటు టౌన్‌హాలులో జరిగిన ఈ మహాభారత ఉపన్యాసాలు అందరినీ బాగా ఆకట్టుకున్నాయి.

# పార్లమెంటులో పొట్టి శ్రీరాములు విగ్రహం నెలకొల్పాలి


వెంకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కె.వి.చలమయ్య దంపతులు

రొటేరియన్ పిహెచ్‌ఎఫ్ కె.వి.చలమయ్య తన సతీమణి ఇటీవల ఢిల్లీలో కేంద్రమంత్రి వెంకయ్యనాయుడును కలిసి తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కొరకు ప్రాణత్యాగం చేసిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని పార్లమెంటు ఆవరణలో ఏర్పాటు చేయమని వినతిపత్రం సమర్పించారు. గత ప్రభుత్వాలకు విన్నవించినా తమ విన్నపం ఆచరణకు నోచుకోలేదని, నెల్లూరీయులుగా తమ సహకారంతో ఈ విన్నపం సాకారం అవుతుందని తాము కుంటున్నామని పేర్కొన్నారు. మహాత్మాగాంధీ శిష్యులలో ప్రథముడిగా వుండిన వ్యక్తి పొట్టి శ్రీరాములని, ఆయన కాంస్య విగ్రహాన్ని పార్లమెంటు ఆవరణలో, చిత్రపటాన్ని పార్లమెంటు హాలులో పెట్టాలని భారతరత్న బిరుదు ప్రదానం చేయాలని సూచించారు.

# నెల్లూరు డిఎస్పీలు మారేనా?

నెల్లూరు నగరం, రూరల్, కావలి, గూడూరు డిఎస్పీలను త్వరలో మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డిని బదిలీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకప్పుడు జిల్లాలో ఎస్ఐగా, సిఐగా విధులు నిర్వహించి ఎన్నికలకు ముందువరకు నెల్లూరు రైల్వే డిఎస్పీగా పనిచేసిన శ్రీనివాసరావు నగర డిఎస్పీగా వచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అలాగే ఇటీవల జడ్పీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి సహకరించిన ఓ మాజీజడ్పీటీసీ అల్లుడికి నెల్లూరు రూరల్ డిఎస్పీ పోస్టింగ్‌కు అధికారపార్టీ నాయకులు హామీ ఇచ్చినట్లు తెలుస్తుంది. నెల్లూరురూరల్ డిఎస్పీగా వున్న వి.యస్.రాంబాబును గూడూరు లేదా కావలి డిఎస్పీగా బదిలీచేసే అవకాశముంది.

# స్థలాలు చూపండి

నెల్లూరురూరల్ కొత్తూరులో 2012లో పేదలకు పంచిన ఇళ్ల పట్టాలకు సంబంధించి స్థలాలను చూపాలని కోరుతూ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపరెడ్డి సురేష్‌రెడ్డి సోమవారం ఆర్డీఓ సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, ఎమ్మార్వో బి.జనార్ధన్‌రావులను కలిసి వినతిపత్రం సమర్పించారు. 2012లో అప్పటి ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతులమీదుగా 511మంది పేదలకు పట్టాలిచ్చారని, ఇంతవరకు స్థలాలు చూపలేదని ఆయన పేర్కొన్నారు. అలాగే ముత్తుకూరు రోడ్డు విస్తరణలో భాగంగా ఖాళీ చేయించిన హరనాథపురం నిర్వాసితులకు కేటాయించిన స్థలం గుంతల మయంగా వుందని, దీనిని చదునుచేసి మిగతా వారికి కూడా స్థలాలు కేటాయించాలని ఆయన కోరారు.

# పలుకరించిన జల్లులు

ఎండలతో ఇంతకాలం మండిపోయిన నెల్లూరును చిరుజల్లులు పలుకరించాయి. మార్చి నుండి కూడా ఈ జిల్లాలో ఎండలు అదరేస్తున్నాయి. జూన్ నెలలో నైరుతి ఋతుపవనాల ప్రభావతంతో వాతావరణం రెండు రోజులు చల్లబడింది కాని ఆ తర్వాత యథాప్రకారం ఎండలు కాయసాగాయి. నాలుగురోజుల క్రితం దాకా కూడా ఎండలు వేసవికాలాన్నే తలపించాయి. ఎట్టకేలకు వాతావరణం చల్లబడింది. చిరుజల్లులు కురుస్తున్నాయి. ఎండల నుండి ఉపశమనం లభించింది.

## స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా
# బివి రామారావు

నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్‌కు కొత్త డిఎస్పీగా బి.వి.రామారావు రానున్నారు. ఇటీవలే ఆయన పదోన్నతి పొందారు. స్పెషల్‌బ్రాంచ్ డిఎస్పీగా బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో నెల్లూరు స్పెషల్‌బ్రాంచ్ సిఐగా, కోవూరు, జిల్లా శిక్షణా కేంద్రం సిఐగా, గుంటూరులో కంట్రోల్‌రూం సిఐగా పనిచేసివున్నారు.

## మంత్రి నారాయణ
# పి.ఏగా నాగేశ్వరరావు

రాష్ట్ర మునిసిపల్‌శాఖ మంత్రి డాక్టర్ నారాయణ పి.ఏగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కాల్‌సెంటర్ అధికారిగా పనిచేస్తున్న నాగేశ్వరరావు నియమితులయ్యారు. నాగేశ్వరరావు గతంలో ప్రజావిజ్ఞప్తుల దినం రోజున వచ్చే అర్జీలకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. పౌర సరఫరాల శాఖకు వచ్చే ఫిర్యాదులను సాఫ్ట్‌వేర్ ద్వారా నేరుగా తెలియజేసే విధానాన్ని ఏర్పాటు చేశారు. ఎన్నికల సమయంలో ఓట్ల నమోదు, తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆయన తాజాగా మంత్రి నారాయణ పిఏగా నియమితులయ్యారు.

**బిజెపి జాతీయనాయకులు, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు ఆయన శిష్యులు అత్యంత ఆత్మీయతతో అక్షరాభిషేకం చేశారు. ఈ జిల్లా వాసి, సింహపురి ముద్దుబిడ్డ అయిన వెంకయ్యనాయుడు జాతీయస్థాయి రాజకీయాల్లో ఇప్పుడు ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నారు.**





# వెంకయ్యకు శిష్యుల అక్షరాభిషేకం

తొలి నుంచి ఒకే మాట..ఒకే బాట.. ఒకే పార్టీ.. ఒకే సిద్ధాంతం అనే నిబద్ధతతో రాజకీయరంగంలోకి ప్రవేశించిన వెంకయ్య నాయుడు, మహోన్నత నేత ప్రధాని మోడీ మంత్రివర్గంలోనూ స్థానం సంపాదించుకుని జాతీయస్థాయిలో సింహపురి సీమ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించారు.

ఇటీవల వెంకయ్యనాయుడు నెల్లూరుకు వచ్చినప్పుడు స్థానిక విపిఆర్ కల్యాణ మండపంలో ఘనంగా జరిగిన పౌరసత్కారం సందర్భంగా.. ఆయన శిష్యులైన నంది మండలం చంద్రశేఖరరాజు, ఒంటేరు శ్రీనివాసులురెడ్డి, కల్పం చంద్రశేఖర్‌లు వెంకయ్య నాయుడిపై వున్న గురుభక్తితో ఆయన మహోన్నత వ్యక్తిత్వాన్ని, ఆయన జీవితంలోని కొన్ని ముఖ్యమైన సంఘటనలను వివరంగా తెలియజేస్తూ ఒక అందమైన పుస్తకం ముద్రించి వెంకయ్య అభిమానులకు, ఆప్తులకు అందించారు. అందమైన ఆఫ్‌సెట్ ముద్రణతో, రంగుల మాలికగా వున్న ఈ 40పేజీలున్న పుస్తకంలో, వెంకయ్యనాయుడు జీవితంలోని కొన్ని ముఖ్యమైన ఘట్టాలకు సంబంధించిన ఫోటోలను కూడా అందంగా ముద్రించారు. 'తెలుగుతేజం.. శ్రీ ఎం.వెంకయ్యనాయుడు గారికి అక్షరాభినందన'.. అంటూ జన హృదయనేత హృదయదర్పణంగా పుస్తకాన్ని ముద్రించడం ఎంతో అభినందనీయం. రాజకీయరంగంలో ఎన్నో ఆటుపోట్లు అధిగమించి, తొలి నుంచీ పార్టీలో నిబద్ధతతో, నీతి–నిజాయితీతో వుంటూ, అమోఘమైన వాక్చాతుర్యంతో ప్రత్యర్థుల విమర్శలను తిప్పికొడుతూ, రాజకీయరంగంలో ఒక్కొక్క మెట్టూ ఎదుగుతూ అసాధారణ ప్రజ్ఞావిశేషాలతో నేడు జాతీయస్థాయి నేతగా..ఎందరికో స్ఫూర్తిప్రదాతగా, పుట్టిన గడ్డను ఏనాటికీ విస్మరించని మానవీయ నేతగా, ఎంతో ఆదర్శవంతమైన నాయకునిగా వెంకయ్యనాయుడు ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. పార్టీయే సర్వస్వంగా.. ప్రజాసేవే పరమార్థంగా వున్న ఆయన ఏనాడూ పదవుల కోసం వెంపర్లాడలేదు. పదవులే ఆయనను వెతుక్కుంటూ వచ్చాయి. తాను ఏ పదవిలో వున్నా ఆ పదవికే వన్నె తెచ్చిన మంచినేత మన వెంకయ్యనాయుడు. భారతీయ జనతా పార్టీయే శ్వాసగా, ధ్యాసగా ఆయన జీవించారు. సిద్ధాంత నిబద్ధతకు ఆయన నిలువెత్తు సంతకం అయ్యారు. అసెంబ్లీలో వున్నప్పుడు అసెంబ్లీ టైగర్‌గా రాణించారు. పార్లమెంట్‌లో వున్నా అద్భుతమైన వాగ్ధాటితో, అపారమైన పరిజ్ఞానంతో జననేతగా విఖ్యాతి చెందుతూనే వున్నారు. దేశవ్యాప్తంగా ఎందరో అగ్రస్థాయి నాయకులు, ప్రముఖులతో ఆయనకు మంచి సాన్నిహిత్యం వుంది. ప్రజల సమస్యల సాధనకు కృషి చేసే అపారమైన అనుభవం వుంది. ఆయన సుగుణశీలి. అసాధారణ ప్రజ్ఞాశాలి. అయినప్పటికీ, తాను ఏ స్థాయిలో వున్నా, ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగివుండే మంచి గుణం ఆయన సొంతం. ఢిల్లీలో వున్నా, గల్లీల్లో వున్న ప్రజల సమస్యలను సైతం ఆయన ఏనాడూ విస్మరించింది లేదు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే తత్వం, ఎక్కడ వున్నా ప్రజల అభివృద్ధిని కాంక్షించే మనస్తత్వం ఆయనది. అందుకే, వెంకయ్యనాయుడు అంటే ఒక వ్యక్తి కాదు..ఒక వ్యవస్థ అనే చెప్పాలి. జాతీయస్థాయి నేతగా, జిల్లా అభివృద్ధి ప్రదాతగా వుంటూ ఆయన ప్రజలందరి మన్ననలు అందుకుంటున్నారు. అంతటి మహోన్నత నేత గురించి ఒక మంచి పుస్తకాన్ని ముద్రించడం ఎంతో అభినందనీయం. అంతేకాదు, గ్రామీణ ప్రజలకు సైతం అభివృద్ధి ఫలాలు అందాలని, సేవాభావంతో ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో ఏర్పడిన స్వర్ణభారత్ ట్రస్ట్‌కు ఆయన కుమార్తె శ్రీమతి దీపావెంకట్ చేస్తున్న కృషిని కూడా ఈ పుస్తకంలో వివరించారు. తండ్రికి తగ్గ తనయగా దీపా వెంకట్ చేస్తున్న సేవలను అభినందించారు. నీతి నిజాయితీలకు.. నిబద్ధతకు ప్రతీక అయిన వెంకయ్యనాయుడు గురించి, ఆయన సేవాభావం, రాజకీయ జీవితం తదితర విషయాలను వివరించే ఈ పుస్తకం అందరికీ ఎంతో స్ఫూర్తిదాయకమే కాక, ఆయన సహచరులు, అభిమానులందరికీ ఇది ఒక మంచి కరదీపికగా వుంటుందని చెప్పవచ్చు. ఇంత మంచి పుస్తకాన్ని ముద్రించి గురువుకు అక్షరాభిషేకం చేసిన ఆ శిష్యులకు 'లాయర్' అభినందనలు.

## సింహపురి సమాచారం

# అన్నమయ్య కీర్తనల సమాచారం వుంటే తెలపండి

**- ప్రముఖ సంగీతవేత్త సాయికృష్ణ యాచేంద్ర విజ్ఞప్తి**



పదకవితా పితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యులవారు శ్రీ వేంకటేశ్వరునిపై అనన్యమైన భక్తితో 32వేల సంకీర్తనలు రచించారని, అయితే మనకు ఇప్పటికి 12వేల సంకీర్తనలు మాత్రమే లభ్యమయ్యాయని, మిగిలిన సంకీర్తనల కోసం అన్వేషిస్తున్నామని, ఒకవేళ ఎవరి వద్దయినా అన్నమయ్య సంకీర్తనల సమాచారం వుంటే తమకు తెలియజేయాలని పదరాగిణి ట్రస్ట్ అధ్యక్షులు, ప్రముఖ సంగీత, సాహిత్యవేత్త డాక్టర్ వివి సాయికృష్ణ యాచేంద్ర కోరారు. జులై నెల 26న వెంకటగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లభ్యమయ్యే అన్నమయ్య రచనలు, కీర్తనలు సేకరించి పదరాగిణి ట్రస్ట్ ద్వారా ముద్రించాలని భావిస్తున్నామని, అన్నమయ్య కుటుంబసభ్యులు రచించిన కీర్తనలను కూడా సేకరిస్తున్నామని, భావితరాలకి అన్నమయ్య సంకీర్తనలను చేరువచేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని, అన్నమయ్య రచనలు, ప్రాచీన గ్రంథాలు వుంటే తమ ఫోన్ నంబర్ 9440585665 కు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# పాఠశాలల్లో కనీస వసతులు కల్పించండి

**- ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి**



ప్రభుత్వం 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించడం మంచిదేనని, అయితే పాఠశాలల్లో కనీస వసతులు కల్పించకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమి వుంటుందని సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు.

బడి పిలుస్తోంది వారోత్సవాల్లో భాగంగా, పొదలకూరులోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జులై నెల 28న జరిగిన కార్యక్రమంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వపాఠశాలల్లో మంచినీటి వసతి, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లోపించడంతో విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం పాఠశాలల్లో కనీస సౌకర్యాల కల్పనకు కృషి చేయాలన్నారు. టెన్త్‌లో అత్యధిక ప్రతిభ కనపరిచే విద్యార్థులకు ప్రోత్సాహంగా తనవంతు సాయం ఎల్లప్పుడూ వుంటుందన్నారు. నియోజకవర్గంలో అలాంటి ప్రతిభ గల విద్యార్థులకు ప్రోత్సాహంగా వుండేందుకు, తనకు ప్రభుత్వం అందజేసే నెలసరి జీతాన్ని వారికి అందజేయనున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి కోనం బ్రహ్మయ్య, ఎంపిడిఓ ఎం.శ్రీహరి, ఎంఇఓ అబ్దుల్‌హమీద్, తహశీల్దార్ వి. కృష్ణారావు, పొదలకూరు సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ, హెచ్ఎం టి. బాలనాగమ్మ, ఉపాధ్యాయుడు అచ్యుత మణి, సిడిసి మాజీ ఛైర్మెన్ పెదమల్లు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన 'అలెగ్జాండర్–పురుషోత్తముడు' అనే ఆంగ్ల నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

# యువతతోనే దేశానికి భవిత

**- వి.సి రాజారామిరెడ్డి**

యువత నైపుణ్యంతోనే దేశానికి ఉజ్వల భవిత ఉంటుందని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి పేర్కొన్నారు. జులై 29న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ వారి సౌజన్యంతో 'ఇన్‌స్పైర్–2014' కార్యక్రమం జరిగింది. ఈ సదస్సునుద్దేశించి ఆచార్య రాజారామిరెడ్డి మాట్లాడుతూ ఈ దేశంలో నైపుణ్యం గల యువతకు కొదవలేదన్నారు. అయితే వారంతా ఇక్కడ అవకాశాలు లభించడం లేదనే సాకుతో విదేశాలలో స్థిరపడి తమ మేధాశక్తిని ఆయా దేశాల అభివృద్ధికి ధారబోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, మేధావులు జాతీయ భావం స్ఫూర్తితో తమ మాతృదేశాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. సైన్స్‌కు మంచి భవిష్యత్ ఉందని, రాబోయే కాలం సైన్స్‌దేనన్నారు. విద్యార్థులు ఆలోచించే తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. బాబా అణుశక్తి కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ రమణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రశ్నించే గుణాన్ని కలిగి ఉండాలన్నారు. ప్రతిరోజూ కొత్త ఆలోచనలను ప్రోది చేసుకోవడం ద్వారా సరికొత్త విజ్ఞానానికి బాటలు వేయగలరన్నారు. ఇంకా పలువురు ప్రొఫెసర్లు ఈ సదస్సులో ఎంతో చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో కార్డియోరెస్పిరేటరీ విభాగాధిపతి డాక్టర్ ప్రసన్నరెడ్డి, విక్రమ సింహపురి విద్యాలయం రిజిస్ట్రార్ నాగేంద్రప్రసాద్, ఏపీస్పీ రెడ్డి గంగాధర్, ప్రిన్సిపాల్ మురుగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలపై కొరడా తప్పదు

**- డిఎస్ఓ**

ప్రజలకు పంపిణీ చేయాల్సిన కిరోసిన్‌ను రేషన్‌షాపు డీలర్లు పక్కదారి పట్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి శాంతకుమారి హెచ్చరించారు. సోమవారం ఆమె నెల్లూరులోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ డీలర్లు అక్రమాలకు పాల్పడితే వారిపై కేసులు తప్పవన్నారు. డీలర్లు సంబంధిత కిరోసిన్ కంపెనీల నుండి ప్రతినెల 20వ తేదీలోపే కిరోసిన్ తెచ్చుకోవాలని, వారు కిరోసిన్ తెచ్చుకునే విషయాన్ని సంబంధిత తహశీల్దార్‌కు తెలిపి వారి పర్యవేక్షణలోనే కిరోసిన్ తెచ్చుకోవాలన్నారు. ప్రతి నెల 22వతేదీలోగా కిరోసిన్ పంపిణీని కూడా పూర్తి చేయాలన్నారు.



శ్రీను గల్పిక

# రియల్ ఎస్టేట్ వ్యాపారంతో ఋణమాఫీ నిధులు

హైటెక్‌రత్న, నవ్యాంధ్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తన ఛాంబర్‌లో కూర్చుని దీర్ఘాలోచనలో పడ్డాడు. ఆయన ముఖంలో తెలియని ఆందోళన ఏదో కనిపిస్తుంది. తమ తమ పనులు ముగించుకుని మంత్రులు పి.నారాయణ, యనమల రామకృష్ణుడు, గంటా శ్రీనివాసరావు, పల్లె రఘునాథరెడ్డి, దేవినేని ఉమామహేశ్వరరావు, సిద్దా రాఘవరావు తదితరులు చంద్రబాబు వద్దకు వచ్చారు. దిగులుగా వున్న చంద్రబాబును చూసి... ఏం సార్, అంత విచారంగా ఉన్నారని నారాయణ అడిగాడు. అందుకు చంద్రబాబు... సీఎం అయ్యాక నాకు దిగులు తప్ప ఇంకేం మిగిలిందని, అధికారంలోకి రామేమోనన్న భయంతో మొన్న ఎన్నికల్లో నోటికొచ్చిన వాగ్దానాలన్నీ చేసాను, ఇప్పుడు వాటిని అమలు చేయాలంటే తల ప్రాణం తోకకొస్తుంది. అట్లాగని అమలు చేయకుంటే ఇక చంద్రబాబు అనే వాణ్ణి ఈ జనం జన్మలో నమ్మరు. ఎలాగోలా ఋణ మాఫీ గండం గట్టెక్కే మార్గం చెప్పండి. కుటుంబానికి లక్షన్నర లెక్కన ఋణమాఫీ చేస్తానని చెప్పాను. ఇప్పుడు వాటికి డబ్బులొచ్చే మార్గం చెప్పండి అని కోరాడు. అప్పుడే అక్కడకు వచ్చిన చిత్తూరు ఎంపీ ఎన్.శివప్రసాద్ కూడా చంద్రబాబు బాధను విన్నాడు. ఆయన వెంటనే... సార్, రాష్ట్ర విభజన పుణ్యమా అని నేను కొన్ని విద్యలు నేర్చుకున్నాను. కొరడాతో వీపు రక్తం కారేటట్లు కొట్టుకోవడం, హరికథ, బుర్ర కథలు చెప్పడం, విచిత్ర వేషాలు వేయడం వంటి విద్యలను ఊరూరా ప్రదర్శిస్తాను, ఆ వచ్చిన డబ్బును ఋణమాఫీ కోసం నావంతు విరాళంగా ఇస్తానని చెప్పాడు. పి.నారాయణ ఉండి... సార్, మనం ఇప్పటికే పట్టుకున్న ఎర్రచందనాన్ని అమ్మడం ద్వారా కొంత డబ్బు వస్తుంది. ఇప్పుడున్న చెట్లను కూడా తాకట్టు పెడదాం, అలాగే ఇప్పటికిప్పుడు కొన్ని వేల ఎకరాల్లో ఎర్రచందనం మొక్కలు నాటి వాటిని కూడా తాకట్టు పెడదాం, ఇంకా బోలెడు డబ్బు వస్తుందని చెప్పాడు. నీ ఐడియా చాలా బాగుంది. అలాగే చేద్దామని చంద్రబాబు అన్నాడు. వెంటనే నిమ్మకాయల చినరాజప్ప అందుకుని... సార్, ఎర్రచందనం చెట్ల కంటే గంజాయి చెట్లయితే తొందరగా పెరుగుతాయి. డబ్బులు కూడా దండిగా వస్తాయన్నాడు. దేవినేని ఉమా మాట్లాడుతూ... సార్, మన రాష్ట్రంలో ఇసుక దండిగా వుంది. ఓ 50ఏళ్ల పాటు ఇసుకరీచ్‌లను అంతర్జాతీయ ఇసుక మాఫియాకు అప్పగించేద్దాం... వారి వద్ద నుండి ముందుగానే ఋణమాఫీకి అవసర మయ్యే డబ్బును తీసేసుకుందామన్నాడు. యనమల రామకృష్ణుడు అందుకుని... సార్, ఋణమాఫీ కోసం ఒరిజినల్ కరెన్సీ ఇవ్వాలంటే తర్వాత మనం అడుక్కోవాల్సిందే. కాబట్టి నకిలీ కరెన్సీ తయారుచేసే వాళ్ళను పిలిపిద్దాం. ఆ కరెన్సీనే రైతులకు నేరుగా ఇచ్చేద్దాం. వాగ్దానం నిలబెట్టుకున్నట్లు ఉంటుంది. ఆర్థికలోటు లేకుండా పోతుందన్నాడు. అప్పుడు పల్లె రఘునాథరెడ్డి లేచాడు. సార్, ఈ ఋణమాఫీ సమస్యను అధిగమించడానికి నా దగ్గర సూపర్ ఐడియా వుందన్నాడు. ఏంటో చెప్పు... కమాన్, కమాన్ అని చంద్రబాబు ఆత్రంగా అడిగాడు. ఏం లేదు సార్, మనమంతా రియల్ ఎస్టేట్ వ్యాపారంలోకి దిగడమే. అందరికీ అనుభవం వుంది, కాకపోతే ఇప్పుడు వ్యాపారం మన కోసం కాకుండా రైతుల ఋణమాఫీ కోసం చేద్దాం. ఋణమాఫీకి మనకు కావాల్సిన కోట్లాది రూపాయలు వచ్చే మార్గం ఇదొక్కటేనన్నాడు. రియల్ ఎస్టేట్ ద్వారా కోట్లా... అది కూడా మనం వ్యాపారం చేస్తేనా..? ఎలా అని చంద్రబాబు టెన్షన్‌గా అడిగాడు. రఘునాథరెడ్డి చెప్పడం మొదలుపెట్టాడు. మనం ముందుగా ఓ వందకోట్లు రెడీగా పెట్టుకుందాం. ముందు గుంటూరు-కృష్ణా జిల్లాలలో ఓ వెయ్యి ఎకరాల దాకా భూములకు అడ్వాన్స్‌లిస్తాం, ఎకరా కోటి లెక్కన కొని అగ్రిమెంట్ చేసుకుంటాం. ఆ వెంటనే మీరు, మన మున్సిపల్ మంత్రి నారాయణ ఇద్దరూ విజయవాడ-గుంటూరుల మధ్యే రాజధాని అని ఒకటికి పదిసార్లు చెబుతారు. దాంతో రియల్ ఎస్టేట్ బకరాలన్నీ ఆ రెండు జిల్లాల్లోకి చేరుతాయి. భూముల కోసం వెంపర్లాడుతాయి. మనం కోటి రూపాయల లెక్కన అడ్వాన్స్ పెట్టిన భూములను వారికి పది కోట్ల లెక్కన అమ్ముదాము... ఇక్కడే వెయ్యి ఎకరాలకు 10వేల కోట్ల ఆదాయం వచ్చేస్తుంది. ఆ తర్వాత ఇక్కడ రాజధాని విషయాన్ని సందిగ్ధంలో పెడదాం. మనం మాత్రం ఈసారి ప్రకాశం జిల్లాలో పదివేల ఎకరాలకు అడ్వాన్స్‌లిచ్చి అగ్రిమెంట్ చేసుకుంటాం... అప్పుడు మీరు, నారాయణ సారు... గుంటూరు, కృష్ణ జిల్లాలో భూముల లభ్యత కష్ట సాధ్యంగా వుంది కాబట్టి ప్రకాశం జిల్లాలో రాజధాని నిర్మాణాన్ని పరిశీలిస్తున్నామని స్టేట్‌మెంటిస్తారు... అప్పటికే కృష్ణ గుంటూరు జిల్లాల్లో భూములు కొన్న రియల్టర్లు నెత్తిన గుడ్డేసుకోవడానికి బట్టలషాపుకు వెళతారు. ప్రకాశం జిల్లాలోకి కొత్త బకరాలు వస్తాయి. ఇక్కడ పదివేల ఎకరాలను కూడా మంచి లాభానికి అంటగట్టేస్తాం. ఆ తర్వాత ఇక్కడ వాతావరణం, నీటి సౌకర్యం సరిగా లేదని చెబుతాము. ఈలోపు నెల్లూరు-తిరుపతిలో మధ్య మరో 10వేల ఎకరాల భూములు కొనిపెడతాం. యథావిధిగా మీరిద్దరూ రాజధానిని నెల్లూరు-తిరుపతి మధ్య ప్రభుత్వ భూములున్నాయి కాబట్టి ఆ ప్రాంతాన్ని ఎంపికచేసే అవకాశముందని స్టేట్‌మెంటిస్తారు. ఇంకేముంది యథాపలంగా రియల్టర్లు అక్కడకు వచ్చి వాలిపోతారు. ఆ తర్వాత విశాఖ, కర్నూలు జిల్లాలను కూడా ఇదేవిధంగా వాడుకుంటాం. ఋణ మాఫీకి కావాల్సినంత కాదు, ఇంకా ఎక్కువ డబ్బే పోగవుతుందని చెప్పాడు. అంతా విన్న చంద్రబాబు... నీ రియల్‌ఎస్టేట్ ఐడియా బాగుంది రఘునాథరెడ్డి. నువ్వు చెప్పేది వింటుంటే సీఎం కుర్చీని వదిలేసి రియల్‌ఎస్టేట్ వ్యాపారమే చేసుకోవాలని పిస్తుంది. ఇంకెందుకు ఆలస్యం ప్రొసీడ్ అంటూ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు.

కదంబం

## భిక్షకుడు

\- బి.కళాగోపాల్

నిజామాబాద్, 9441631029

ఫ్లైఓవర్ చంద్రవంక నీడలలో పరచుకున్న
ఆకారాలేవో సద్దుమణిగాక పొద్దుపోని
భిక్షకుడు
తన జోలెలోంచి పాత సామానులను
దులుపుకుంటాడు
అక్కడా ఇక్కడా తిరిగి అడుక్కున్న
చిల్లర నాణాలను అపురూపంగా
లేత బుగ్గల నునురెమ్మలా సుతారంగా
స్పృశిస్తాడు
సొట్టలు పడ్డ గిన్నెలో జ్ఞాపకాలను
వడ్డించుకొని
కాలం ఒడిలో తీరుబడిగా
నెమరువేసుకుంటాడు
పెరిగిన బవిరి గడ్డాన్ని వేళ్లతో దువ్వుతూ
అంతరిక్ష నీలికన్య నక్షత్రాలను
ఆహ్వానిస్తాడు!
చింతలేని ఒంటరినావలో
ఏకాంతంగా ఆంతరంగిక రహస్యాలనేవో
ఊహలనదితో సంభాషిస్తాడు!
ఏ దారులలో తిరుగుతూ తప్పిపోయాడో
అతని నిరీక్షణల చూపులకే తెలుసు!
మబ్బుడొంకల్లో, వానవంకల్లో, చంద్రనిప్పుల
గాలులలో అతనక్కడే!
అతనొక్కడే అనంత దుఃఖమయ జీవితానికి
నిర్వచనంలా!
ఎక్కడి నుండో ఒక ధూళిమేఘాన్ని
ఆసరాగా చేసుకొని పవళిస్తాడు!
గతానికి, వర్తమానానికి నడుమ
చూపుల వంతెనపై అతడు - గమ్యంలేని
బాటసారి!
కళ్లు మూసుకొని తదేక ధ్యానంగా
అతను పాడేపాట గుండెపొరలేదో
తడుముతుంది!
నడిజాము కలలతో చెలిమి చేస్తూ
నిశ్శబ్ద నిశీధిలో కలిసిపోతాడు!
మనిషితనపు ఆనవాళ్లను
ఆ ఫ్లైఓవర్ క్రింద వదలివెళ్తాడు!
రిక్తహస్తాలతో బతుకు శూన్యాన్ని లిఖిస్తాడు!!



## 'చేరా'కు పెరసం సంతాపం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని "పెరసం" కార్యాలయంలో ప్రసిద్ధకవి, విమర్శకులు చేకూరి రామారావు మృతి పట్ల సంతాపసభ జరిగింది. కార్యక్రమంలో పెన్నా రచయితల సంఘం అధ్యక్షులు సూర్య షంషుద్దీన్, వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచల నరసింహం, కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, అవ్వారు శ్రీధర్‌బాబు, కె.వి.కె.కుమార్‌బాబు తదితర కవులు పాల్గొని సంతాపం తెలిపారు.

అధ్యక్షులు షంషుద్దీన్ మాట్లాడుతూ తెలుగు సాహిత్య ప్రపంచానికి విమర్శకుడుగా పరిచయమైన చేకూరి రామారావు, ఆధునిక భాషా శాస్త్ర రంగంలో కొత్త విప్లవాన్ని తీసుకొచ్చారని అన్నారు. మోపూరు పెంచల నరసింహం మాట్లాడుతూ "చేరా" పేరుతో ప్రసిద్ధిగాంచిన రామారావు తెలుగు భాషకు చేసిన సేవ గొప్పదని అన్నారు. గుండాల నరేంద్రబాబు మాట్లాడుతూ 2002లో భారత ప్రభుత్వం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందించిందని అన్నారు. అవ్వారు శ్రీధర్‌బాబు మాట్లాడుతూ తెలుగు సాహిత్య రంగంలో విమర్శకుడిగా సుడిగాలిలా దూసుకువచ్చారన్నారు.

## డా॥ రాధేయ కవితా పురస్కారం

కవిత్వాన్నే జీవితంగా భావించిన సాహితీకృషీవలుడు డా॥ రాధేయ గౌరవార్థం వారి శిష్యులు పెళ్ళూరు సునీల్, సుంకర గోపాల్, దోర్నాదుల సిద్ధార్థ "డా॥ రాధేయ కవితా పురస్కారం" పేరిట రాష్ట్ర స్థాయి అవార్డును నెలకొల్పడం జరిగింది. ఐదవ సంవత్సర పురస్కారం కోసం తెలుగులో కవిత్వం వ్రాసే ఏ ప్రాంతం కవులనుంచైనా వచన కవితలను ఆహ్వానిస్తున్నారు. కవిత ప్రత్యేకంగా వ్రాసిందై ఉండాలి. ఎక్కడా ప్రచురితం కాలేదని హామీ పత్రం జతపరచాలి. పేరు, చిరునామా కవితపై ఉండకూడదు హామీపత్రం మీదనే వ్రాయాలి. న్యాయనిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ కవితకు రూ.2,116/- నగదు, జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. మరో ఇద్దరికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. కవితలు సామాజిక స్పృహ కలిగి ఉండాలి. వస్తువు విషయంలో కవికి పూర్తి స్వేచ్ఛ కలదు. సుదీర్ఘ కవితలు పరిశీలించబడవు. కవితలు చేరాల్సిన చివరి తేదీ 15.08.2014. కవితలు చేరాల్సిన చిరునామా పెళ్ళూరు సునీల్, శ్యామ సుందరపురం, కోట గ్రామం, కోట మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా - 524411. సెల్. 94402 55647, 9492638547.

## "అమృతమూర్తి" పురస్కారాలు



నెల్లూరు పుర మందిరంలో పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కవి బ్రహ్మశ్రీ తిక్కనామాత్య సాహిత్య కవి రచయితల సంఘం సంయుక్త నిర్వహణలో జూలై 27న రాష్ట్రస్థాయిలో వివిధ రంగాల్లో విశేషకృషి చేసిన వ్యక్తులను అమృతమూర్తి పురస్కారాలతో సత్కరించారు. సాహిత్యరంగంలో కోలపల్లి ఈశ్వర్ (నెల్లూరు), వడలి రాధాకృష్ణ (చీరాల), అగస్త్యరాజు సుబ్బారావు(కావలి), ఊసల రజనీగంగాధర్ (హైదరాబాద్), సంపటం దుర్గాప్రసాద్(ఖమ్మం), తెన్నేటి లక్ష్మీనరసింహమూర్తి (గణపవరం), ఆర్ గోపాల్‌రెడ్డి (ప్రొద్దుటూరు), కళారంగంలో చిలుకూరి సుబ్బయ్యాచారి (జంగారెడ్డిగూడెం), షేక్ అమీర్‌ఖాన్ (నెల్లూరు), అక్బర్ ఆలీ (మార్కాపురం), సేవారంగంలో జెవిఎస్ బ్రహ్మానందాచారి(కర్నూలు), ఎ.చెంచునాగేశ్వరరావు(నెల్లూరు), పి.ముత్తు(నెల్లూరు), ఎన్.మధుసూదనరావు (గోగులపల్లి), నూనె నారాయణ(నెల్లూరు), యన్.వి..సుబ్బయ్య(బుజబుజనెల్లూరు), డాక్టర్ చౌకచర్ల భాస్కరరెడ్డి(నెల్లూరు), డాక్టర్ యం.రామ్మూర్తి(అల్లూరు), కె.వెంకటశాంతలక్ష్మి(పేర్నమిట్ట), న్యాయసేవారంగంలో పి.విజయకుమార్‌రెడ్డి(నెల్లూరు), కె.ఆర్.దుర్గాంబ(నెల్లూరు), ఆధ్యాత్మిక రంగంలో దాసరి వెంకటరావు(హైదరాబాద్), చెరువుపల్లి వెంకటసుమన్‌లకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. హేతువాద రచనలతో ప్రజల్ని చైతన్య పరచినందుకు వండర్ బుక్ ఆఫ్ రికార్డులో పేరు నమోదు అయిన సందర్భంగా ఏలూరు ఉపకార్మిక కమీషనర్ రాచపాళెం రఘుకు "పినాకిని" ప్రశంసాపత్రాన్ని అందించింది. ఒంగోలుకు చెందిన కవి వెంకటశ్రీనివాసులును "వికటకవి తెనాలి రామకృష్ణ" బిరుదుతో సత్కరించింది. కార్యక్రమంలో దేవరాల సుబ్రహ్మణ్యాదవ్, సింగారెడ్డి నరసింహారెడ్డి, గానుగపెంట హనుమంతరావు, వాస్తు రామచంద్ర, రిటైర్డ్ ఎస్పై ఓంకారం వెంకటేశ్వరరాజు, "పినాకిని" అధ్యక్షులు కె.మురళీ మోహన్‌రాజు, ఊరుబిండి వెంకటసుబ్రహ్మణ్యశాస్త్రి, పంచాగ్నుల విశ్వేశ్వరశర్మ పాల్గొన్నారు.

## "సప్తస్వరాలు" ఆవిష్కరణ

నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో జూలై 27న "సప్తస్వరాలు" పుస్తకాన్ని ప్రముఖ రచయిత డాక్టర్ కాళిదాసు పురుషోత్తం ఆవిష్కరించారు. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత, ప్రసిద్ధ కవి డాక్టర్ సి.నారాయణరెడ్డి కలం నుంచి జాలువారిన కావ్యాలను పరామర్శిస్తూ నెల్లూరీయులు హెచ్‌ఎస్‌వికె రంగారావు "సప్తస్వరాలు" రచించారు. డాక్టర్ కాళిదాసు పురుషోత్తం ఈ సందర్భంగా మాట్లాడుతూ సినారె తన రచనల్లో చేసిన ప్రయోగాలు సాహితీ ప్రపంచంలో ఆయనకు ప్రత్యేక స్థానాన్ని కల్పించాయన్నారు. కార్యక్రమంలో సియంవి చంద్రకుమార్, శైలజ, ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## రాశి - మీ వాసి



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

తేది. 01.08.2014 నుండి
తేది. 07.08.2014 వరకు

ఈ వారము మీనంలో కేతువు, మిథునంలో శుక్రుడు, కర్కాటకంలో రవిబుధగురువులు, కన్యలో రాహువు, తులలో శనికుజులు, కన్యతులవృశ్చికధనురాశులలో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగము:
తేది 1 శుక్రవారము గరుడ పంచమి నోము.
తేది 8 శుక్రవారము శ్రీ వరలక్ష్మివ్రతం.
గురుమౌఢ్యమి సమాప్తి.

శ్రావణమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 01 | శుక్ర | పంచమి | ప॥గం.11.40వ॥ |
| తేది. 02 | శని | షష్ఠి | ప॥గం.12.30వ॥ |
| తేది. 03 | ఆది | సప్తమి | ప॥గం.12.20వ॥ |
| తేది. 04 | సోమ | అష్టమి | ప॥గం.12.38వ॥ |
| తేది. 05 | మంగళ | నవమి | ప॥గం.11.58వ॥ |
| తేది. 06 | బుధ | దశమి | ఉ॥గం.10.50వ॥ |
| తేది. 07 | గురు | ఏకాదశి | ఉ॥గం.9.20వ॥ |

### మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక విషయాలలోగాని, ఇతర విషయాలలోగాని నిర్ణయాలు చేయగలిగిన ధైర్యం ఉండదు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఉన్నత విద్యావకాశాలు లభించగలవు. స్థిరాస్తుల విషయంలో నిర్ణయాలు వాయిదా వేయండి. వృత్తి వ్యాపారాలలో ఆదాయ వ్యయాలను సమీక్షించుకుంటాయి. అభివృద్ధి ప్రయత్నాలు చేస్తారు. ఆదాయముకంటే ఖర్చులు అధనంగా ఉంటాయి.

### వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రభుత్వ అనుమతులు బ్యాంకు రుణాలు మంజూరు కాగలవు. ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలు లభించగలవు. ఆర్థికంగా బాగుండి, ఆదాయం పెరుగుతుంది. ఇంట్లో ప్రశాంతత నెలకొంటుంది. సోదరులకు వారి కుటుంబానికి మేలు జరుగుతుంది. వాయిదాపడిన పనులు కొనసాగుతాయి. అధికారుల వల్ల ఉద్యోగులకు ఆదరణ, పనిభారం పెరుగుతుంది.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్య ప్రయత్నాలలో విరామం ఏర్పడుతుంది. రావలసిన బాకీలు అందుతాయి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు, స్థానచలనము ఉండవచ్చును. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం బాగుంటుంది. ఆదాయం తృప్తికరంగా ఉండినా కుటుంబ ఖర్చులు, ఇతర ఖర్చులు పెరుగుతాయి. గృహవస్తు వాహనములు రిపేర్లు ఏర్పడతాయి. సమాజ అభివృద్ధి ప్రయత్నాలకు సహాయపడతారు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

కోర్టు కేసులు కొంత ఇబ్బంది పెడతాయి. అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులతో అనుకూలత తక్కువ. పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు ఈ సమయం మంచిది కాదు. వృత్తి జీవనము కలవారికి ఆర్థికముగా బాగుంటుంది. వ్యవసాయదారులు, ఫలసాయదారులకు సేద్యం ఆశాజనకంగా ఉంటుంది. బంధుముఖ్యులకు అనారోగ్య బాధలుంటాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తిపరంగా సంతృప్తి ఉంటుంది. చేసే పనులపై శ్రద్ధ తగ్గుతుంది. మాటలు, ప్రవర్తనను అదుపులో ఉంచుకోవాలి. లేదంటే తగువులు కలిగే అవకాశం ఉన్నది. వృత్తి ఉద్యోగ బాధ్యతలను శ్రద్ధగా నిర్వహించండి. అధికారులకు ప్రభుత్వమునకు వివరణలివ్వడం నోటీసులు అందుకొనడం ఉద్యోగులకు ఇబ్బంది కలిగించవచ్చును. విలువైన వస్తువులు పత్రాలు జాగ్రత్త పరచుకొనండి.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభవార్తలు వింటారు. ఉత్సాహంగా పనులు పూర్తి చేస్తారు. వ్యవహారాలలో విజయం లభిస్తుంది. కొత్త పెట్టుబడులకు, నూతన పరిశ్రమల స్థాపనకు అన్ని విధాల ప్రోత్సాహం లభిస్తుంది. ఉద్యోగులకు అధికారుల వద్ద మంచి గుర్తింపు, ముఖ్య అదనపు బాధ్యతలు పైనబడటం, ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకడం జరుగుతుంది. ఆర్థిక విషయాలపై శ్రద్ధ చూపెడతారు.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

వ్యాపార వర్గాలకు ఆదాయము తృప్తికరము. ఇంట్లో ఆత్మీయులకు అనారోగ్య బాధలుంటాయి. గృహ, వస్తు, వాహన రిపేర్లు ఖర్చులు పెరుగుతాయి. ఆలోచనలు, ఆశయాలు మెల్లగా కార్యరూపానికి రాగలవు. నూతన పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు అందుతాయి. అవసరాలకు డబ్బు సర్దుబాటై పనిగడిచిపోతుంది. సోషల్ యాక్టివిటీస్‌లో పాల్గొంటారు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఉద్యోగులకు బాధ్యతలు మారడం, స్థానచలనం ఉండగలదు. బంధువర్గంతో విభేదాలు కలుగవచ్చును. బంధువర్గం నుండి అనారోగ్యవార్తలు వింటారు. అనుకున్న పనులు వాయిదా పడవచ్చును. లేక ఆలస్యం కావచ్చును. వ్యాపార వర్గాలకు అభివృద్ధి అవకాశాలు చేజారి పోవచ్చును. స్థిరాస్తుల క్రయవిక్రయాలు వాయిదా వేయండి. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ప్రభుత్వ అనుమతులు బ్యాంకు రుణాలు లభించగలవు. బిడ్డల వివాహ ప్రయత్నాలు, ఉన్నత విద్యాప్రయత్నాలలో ఆందోళన ఉంటుంది. ఆవేశాలు, పట్టుదలను తగ్గించి పరిస్థితులకు సర్దుబాటు చేసుకొనవలసి ఉంటుంది. అగ్రిమెంట్స్, ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్తపడండి. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. ఉదరకోశ, శ్వాసకోశ అనారోగ్య బాధలుంటాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ప్రజా జీవితంలో మీ సూచనలు సలహాలు ఆమోదయోగ్యం అవుతాయి. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి. అనుకున్న కార్యక్రమాలు, పనులు ఆశించిన విధంగా జరగవు. వ్యాపారవర్గాలలో స్తబ్ధత ఏర్పడి ఆదాయం తగ్గవచ్చు. వృత్తి వ్యవసాయాలు ఆశావహంగా సాగుతాయి. అయితే సమస్యలను పరిష్కరించే తెలివితేటలు బాగుంటాయి. దైవ కార్యములకు సహాయపడతారు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కాని కుటుంబ ఖర్చులు, సేవా కార్యక్రమాలకు సహాయపడటం వల్ల ఖర్చులు అధనంగా ఉంటాయి. అవసరాలకు ఋణం చేసినా చేయవచ్చును. ఆర్థిక విషయాలలోగాని, కుటుంబ విషయాలలోగాని తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. స్థిరాస్తుల కొనుగోలు విషయంలో పేచీలు రావచ్చును. అనుకోని ప్రయాణాలుండగలవు. ఆరోగ్యపరంగా కొద్దిపాటి ఇబ్బందులుంటాయి.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆత్మీయులను, అధికారులను కలుసుకొంటారు. నూతన వస్తువులు, ఆభరణములు వంటివి సమకూర్చుకొంటారు. ఉద్యోగులకు అధికారుల వత్తిడి, స్థానచలనము వంటివి ఉండవచ్చును. వృత్తి వ్యాపారాలలో ఆర్థికస్థితి బాగుండి ఆదాయము బాగుంటుంది. రావలసిన బాకీలు లభించగలవు. పనులకు ఆటంకాలు జరుగుతూ కొనసాగిస్తారు. దూరప్రయాణాలు జరుగును.

# ఆత్మకూరు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

## - ఎమ్మెల్యే మేకపాటి గౌతంరెడ్డి



ఆత్మకూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని, ముఖ్యంగా ఆత్మకూరును పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి గౌతంరెడ్డి అన్నారు. ఆత్మకూరులో జులై 28న ఎంపిపిగా సిద్ధం సుష్మ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతంరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలు తెలుసుకునేందుకు వారంలో మూడు రోజులపాటు పర్యటించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఒక కన్సల్టెన్సీని ఏర్పాటు చేసి, నివేదిక రూపొందించుకుని, ప్రాధాన్యత క్రమంలో ఆ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ, జడ్పీ ఛైర్మెన్‌గా తన విజయానికి ఎంతగానో సహకరించిన ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌతంరెడ్డి, తిరుపతి ఎంపి వరప్రసాద్ తదితరులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ కోదండరామిరెడ్డి, మండల కన్వీనర్ ఇందూరు నారసింహారెడ్డి, వైఎస్సార్సీపి నాయకులు గంగా శ్రీనివాసులునాయుడు, ఉప మండలాధ్యక్షుడు తోట కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# బిజెవైయం జిల్లా పథాధికారుల సమావేశం



నెల్లూరు మినీబైపాస్‌లోని బిజెపి జిల్లా కార్యాలయంలో జూలై 26న భారతీయ జనతా యువమోర్చా (బిజెవైయం) జిల్లా పథాధికారుల సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న బిజెవైయం జిల్లా అధ్యక్షులు మొగరాల సురేష్ మాట్లాడుతూ వివిధ మండలాలలో బిజెవైయం కమిటీలను ఏర్పాటు చేసుకొని నూతన యువతను పార్టీలోకి ఆహ్వానిస్తూ బిజెవైయం అసెంబ్లీ సదస్సులు త్వరలో నిర్వహించాలని పేర్కొన్నారు. దేశ ప్రజలందరూ బిజెపి మీద నమ్మకంతో అధికారం ఇచ్చినందుకు పేద,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి దోహదపడే విధంగా విద్య, వైద్యం, ఉపాధి, రక్షణ రంగాలలో అనేక మౌలిక వసతులు కల్పించడంతో పాటు నేటి సమాజానికి అవసరమైన అనేక సంక్షేమ పథకాల గుర్చి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆ పథకాలు నేరుగా లబ్ధిదారునికి చేరే విధంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు మన జిల్లాను స్మార్టు సిటీగా చూడాలనే కోరికను ఫలించే దిశలో బిజెవైయం కార్యకర్తలందరు పని చేయాలని పేర్కొన్నారు. కార్యకర్తలు సమాజ అభివృద్ధికి దోహదపడే విధంగా క్రమశిక్షణతో ముందుకు పోవాలని, ప్రజలకు అందుబాటులో వుండాలని అన్నారు. సమావేశంలో బిజెవైయం రాష్ట్ర ఉపాధ్యక్షులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి టి.మమతారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యాకసిరి ఫణిరాజు, దాసరి ప్రసాద్, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఆవుల నాగేంద్ర, ముక్కు రాధాకృష్ణ, చెవుల యుగంధర్, వినయ్ నారాయణ, శాఖమూరి శ్రీ హరి, నగర ప్రధాన కార్యదర్శులు బెల్లంకొండ నాగరాజు, పావళ్ళ శివ, జిల్లా పథాధాకారులు పి.మల్లికార్జున, అంకిరెడ్డి, ఎన్.సి.పెంచలయ్య, యం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# హెపటైటిస్ పట్ల అప్రమత్తంగా వుండాలి

## డాక్టర్ జానకిరాం

హెపటైటిస్ (కామెర్లు) పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని నగరంలోని బొల్లినేని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యశాలలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ జానకిరాం సూచించారు. జులై28న ఆయన నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హెపటైటిస్ అంటే లివర్ వాపు అని, జూలై 28వ తేదీని ప్రపంచ హెపటైటిస్ డే గా జరుపుకుంటున్నామని తెలిపారు. హెపటైటిస్–బి వైరస్‌ను బ్లూమ్‌బర్గ్ అనే శాస్త్రవేత్త కనుగొన్నారన్నారు. ఈ వ్యాధి దరిచేరకుండా వుండేందుకు పుట్టిన బిడ్డకు వైద్యుల సూచనల మేరకు 3,4,5 నెలల్లో హెపటైటిస్–బి టీకాను వేయించాలని ఆయన సూచించారు. ప్రతి అయిదేళ్ళకు ఒకసారి ఈ టీకాలు వేయించుకోవాలని తెలిపారు. ఒకసారి ఈ వ్యాధి బారిన పడితే జీవితాంతం బాధలు పడాల్సివస్తుందని, కనుక ప్రజలు ఈ వ్యాధిపట్ల అప్రమత్తంగా వుండి, వైద్యుల సలహాలు పాటించి, ఆరోగ్యవంతంగా వుండాలని ఆయన కోరారు.

## గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి నైపుణ్యంతో...

# అరెస్టైన అంతరరాష్ట్ర నిందితుడు ముఖేష్

నెల్లూరు పోలీస్ కవాతు మైదానంలో గల ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో జూలై 28న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అంతరాష్ట్ర నిందితుడు ముఖేష్‌ను అరెస్ట్ చేసినట్టు ఏఎస్పీ గంగాధర్ తెలిపారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన దాసరి ముఖేష్ చిల్లకూరు మండలం ముత్యాలపాలెంలో నివసిస్తూ హైదరాబాద్, విజయవాడ, పశ్చిమగోదావరి, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో దొంగతనాలు చేసి జైలుశిక్ష అనుభవించారని పేర్కొన్నారు. గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి నిర్వహణలో గూడూరు నగర సిఐ వి.భూషణం, ఎస్సైలు ఎం.బాబీ, జి.అజయ్‌కుమార్‌లు ఈ అంతర రాష్ట్ర నిందితుడిని చిల్లకూరు బైపాస్ రోడ్డులో అరెస్ట్ చేసి రూ॥12లక్షల విలువ చేసే బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారని వెల్లడించారు. గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి విచారణలో అతను 1145గ్రాముల బంగారం, 750గ్రాముల వెండి దొంగిలించినట్లు తెలిపాడని అన్నారు. అందులో 926గ్రాముల బంగారం, 150 గ్రాముల వెండి నగలు మాత్రమే తమకు స్వాధీనపరచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సిఐ, ఎస్సై, కానిస్టేబుళ్ళకు రివార్డులు ఇవ్వడానికి సిఫార్సు చేసామని ఆయన తెలిపారు.

## ఈద్ కిట్‌లు పంపిణీ చేసిన

# పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా

నెల్లూరులోని ములుముడి బస్టాండ్ ఆజాద్ సెంటర్‌లో జూలై 28న పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా నిర్వాహకులు రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు ఈద్ కిట్‌లు పంపిణీ చేసారు. కిట్‌లో రంజాన్ పండుగ జరుపుకోవడానికి కావలసిన ఫలసరుకులు వున్నాయని ఈ సందర్భంగా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ముష్తీఅబ్బస్ పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అబ్దుల్‌గఫార్, సయ్యద్‌ఖాసీఫ్, జిల్లా కార్యదర్శి అహ్మదుల్లా, జాఫర్, కార్పొరేటర్ అబ్దుల్ జలీల్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో రంజాన్



పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గత నెల 29వతేదిన జిల్లాలో ముస్లింసోదరులు ఎంతో భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా నగరంలో వున్న అన్ని మసీదులు, ఈద్గాల్లో మతపెద్దల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. దైవభక్తిని, దయాగుణం, మానవత్వం, దాతృత్వం, సహనం సామరస్యం వంటి అనేక సుగుణాలను పెంపొందించే ఈ పండుగను ముస్లిలందరూ ఎంతో సంతోషంతో జరుపుకున్నారు. ఒకరికొకరు సంతోషంగా ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ అంటూ రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. అనేకచోట్ల కులమతాలకు అతీతంగా అందరూ ఈ పవిత్రమైన పండుగలో పాల్గొన్నారు. రంజాన్ సందర్భంగా నగరంలోని బారాషహీద్ దర్గా ప్రాంతం పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడింది. ఇక్కడ జరిగిన ప్రార్ధనల్లో నెల్లూరు నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌తో పాటు, జాయింట్‌కలెక్టర్ రేఖారాణి, ఎస్పీ రెడ్డి గంగాధర్, నగర ఎమ్మెల్యే అనిల్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ జాన్‌శ్యాంసన్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలు, ఈద్గాల వద్ద అధికారులు షామియానాలు వేసి, భక్తులకు మంచినీటి వసతి సౌకర్యాలు కల్పించారు.

# మార్కెట్ అపరిశుభ్రతపై జేసీ ఆగ్రహం



నగరంలోని ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ మురికితో, అపరిశుభ్రంగా వుండడం పట్ల జాయింట్ కలెక్టర్ రేఖారాణి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె మార్కెట్‌ను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించారు. మార్కెట్లో కూరగాయల ధరలు ఎక్కువగా వుండడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. ధరలపై దుకాణదారులను ప్రశ్నించారు. అక్కడ లైసెన్సు లేని దుకాణాలను పరిశీలించి వాటిని మూతవేయించారు. అదేవిధంగా, తూకం మోసాలను కూడా గుర్తించి, ఆ పరికరాలను సీజ్ చేయించారు. అనధికారికంగా వున్న పలు దుకాణాలను, అధికంగా వున్న స్టాక్‌ను సీజ్‌చేసి, ఆ కూరగాయలను మొబైల్ వాహనాల్లో మురికివాడల ప్రాంతాల్లో విక్రయించాలని ఆమె అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ అధికారులను, సిబ్బందిని రప్పించి మార్కెట్‌ను వెంటనే శుభ్రం చేయించారు.

# గూడూరు పట్టణాన్ని అభివృద్ధి పరుస్తాం!

**- తొలి మున్సిపల్ సమావేశంలో చైర్‌పర్సన్ పొనకా దేవసేన**



గూడూరు మున్సిపల్ సమావేశ మందిరంలో బుధవారంనాడు చైర్‌పర్సన్ పొనకా దేవసేన అధ్యక్షతన తొలి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో టిడిపి, వైఎస్సార్‌సిపీ కౌన్సిలర్లు పాల్గొన్నారు. తొలుత వైఎస్సార్‌సిపీ 25వవార్డు కౌన్సిలరు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణానికి తమ పార్టీ కౌన్సిలర్లంతా సహకరిస్తామని తెలిపారు. పట్టణంలోని అన్ని వార్డులకు నిధుల కేటాయింపులో సమన్యాయం చేయాలని, అలాగే ప్రతి సభ్యుని సలహా తీసుకొని పట్టణాభివృద్ధికి కృషిచేయాలని అన్నారు. 32వ వార్డు కౌన్సిలరు నాశిన నాగులు మరియు 21వ వార్డు కౌన్సిలరు మరియు వైస్ ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రూ॥64.15కోట్లతో నిర్మించిన వాటర్ కండలేరు స్కీము ఇప్పటికే పూర్తి కాలేదని అసంపూర్తిగానే వుందని 2012 డిసెంబర్ 14వతేదీ పూర్తైనట్లు కమీషనరు, పబ్లిక్ హెల్త్ అధికారులు అప్పటి ప్రత్యేక అధికారికి, స్థానిక ఇంజనీర్లకు తెలియకుండా ఎటువంటి తనిఖీలు చేపట్టకుండా స్వాధీనం చేసుకున్నట్లు రికార్డులు సృష్టించుకున్నారని, ఇప్పటికీ కూడా పలు ప్రాంతాల్లో పైపులైను వేయలేదని పట్టణంలో మంచినీటి సరఫరా వ్యవస్థ అస్తవ్యస్థంగా వుందని కండలేరు నుంచి గూడూరుకు సరఫరా చేసే ప్రధాన పైపు లైనులో నీరు వదిలిన వెంటనే ఎక్కడికక్కడ పగిలిపోతున్నాయని ఇంత నాసిరకమైన స్కీమును అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై 65కోట్ల రూపాయలను గంగ పాలు చేశారని నాశిన నాగులు ఆరోపించారు. ఈ పథకం పురపాలక సంఘానికి స్వాధీనం చేయలేదని దానిపై జరిగిన అవినీతి అవకతవకలపై ఉన్నతస్థాయి దర్యాప్తును సంస్థల చేత విచారణ చేయించి అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానించింది. పింఛన్ల పంపిణీ ప్రస్తుతం అధ్వానంగా ఉందని ఎప్పుడిస్తారో, ఎక్కడిస్తారో తెలియక ప్రజలు తిరుగుతున్నారని ఇరుపార్టీల వారు ప్రశ్నించారు. దీని విషయంపై డిఆర్‌డిఏ పిడికి లేఖ రాయాలని సభ్యులంతా ఏకగ్రీవంగా తీర్మానించారు. పట్టణంలో పారిశుధ్య మెరుగుకు కృషిచేయాలని ఇరు పార్టీల సభ్యులు కోరారు. కౌన్సిల్ హాలులో మున్సిపల్ ఛైర్ పర్సన్ పొనకా దేవసేన మాట్లాడుతూ 33 వార్డులకు పురపాలక సంఘ సాధారణ నిధుల నుండి వార్డుల అభివృద్ధి కోసం ఒక్కొక్క వార్డుకు 2లక్షల రూపాయలను కేటాయిస్తున్నానని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అనూరాధ పాల్గొన్నారు.

# గీటురాయి

(మొదటిపేజీ తరువాయి)

సెంథిల్ కుమార్ 2007బ్యాచ్ ఆంధ్రా కేడర్ ఐపిఎస్ అధికారి. గుంటూరులో ట్రైనింగ్ తీసుకున్నారు. తర్వాత విజయనగరం ఏఎస్పీగా పనిచేసారు. ఆపైన శంషాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తూ 2013 డిసెంబర్ 2న అనంతపురం జిల్లా ఎస్పీగా బదిలీ అయ్యారు. జులై 16న రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఐపిఎస్‌ల బదిలీలలో భాగంగా ఆయనను నెల్లూరుజిల్లాకు బదిలీ చేసారు.

సరైన అధికారి లేక సమర్ధత లోపించి గత కొన్నేళ్లుగా జిల్లాలో పోలీసు వ్యవస్థ గాడి తప్పింది. పోలీసు ఉద్యోగాలు కూడా బ్యాంకు ఉద్యోగాలు మాదిరిగా అయ్యాయి. ఇంతకుముందు ఇతర శాఖల్లో ఉద్యోగులకు పోలీసులకు కొంతన్నా తేడా ఉండేది. ఇప్పుడు ఇద్దరికీ తేడా లేకుండా పోయింది. దొంగలుపడ్డ ఆర్నెల్లకు పోలీసులొచ్చారనే సామెతగా పోలీసు పనితీరు వుంది. 1999ప్రాంతంలో ఈ జిల్లా ఎస్పీగా విధులు నిర్వహించిన కె.శ్రీనివాసరెడ్డి పోలీసు అంటే ఏంటో ప్రజలకు చూపించారు. పోలీసు తలచుకుంటే ఏమేం చేయగలడో నిరూపించారు. ఆయన తర్వాత ఎస్పీలుగా వచ్చిన వాళ్లెవరూ ఆ స్థాయి పనితీరును కనపరచలేకపోయారు. ఇప్పటికీ జిల్లా ఎస్పీ అంటే ఈ జిల్లా ప్రజలకు శ్రీనివాసరెడ్డి మాత్రమే గుర్తు. మిగతా వారిపై ప్రజలకు అంతగా గురి కుదరలేదు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన సెంథిల్ కుమార్‌కు నిజాయితీపరుడనే పేరుంది. తమిళనాడు వాసి కాబట్టి పని పట్ల చిత్తశుద్ధి ఉంటుంది. అనంతపురం జిల్లా ఎస్పీగా బాగానే పనిచేసాడనే పేరుంది.

ఈ జిల్లాలో చోరీలు, చైన్ స్నాచింగ్‌లు, లైంగిక వేధింపులు, ఆస్తి తగాదాలు, ట్రాఫిక్, ఎర్రచందనం, ఇసుక అక్రమ రవాణా వంటివి పెద్ద నేరాలు. ముఠా తగాదాలు, కిరాయి హత్యలు, రౌడీయిజం సంస్కృతి చాలా తక్కువ. సెంథిల్‌కుమార్ తాను పని చేయడమే కాదు, ప్రతి పోలీసు చేత చిత్తశుద్ధితో పని చేయిస్తే ఈ సమస్యలను అణగదొక్కడం పెద్ద సమస్య కాదు.

# తగవులాట!

(మొదటిపేజీ తరువాయి)

పట్టించుకోబోమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. విభజన బిల్లులో పదేళ్లపాటు ఉమ్మడిగా అడ్మిషన్లు జరగాలని పేర్కొన్నా తెలంగాణ సర్కార్ దానిని పాటించడానికి నసేమిరా అంటుంది.

కృష్ణా జలాల విడుదల విషయంలోనూ ఇరు రాష్ట్రాల మధ్య పేచీలు తలెత్తడం తెలిసిందే! డెల్టా తాగునీటి అవసరాలకు 10టిఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా వాటర్ బోర్డు నిర్ణయిస్తే, వాటిని నారుమళ్లకు వాడేస్తారంటూ తెలంగాణ ప్రభుత్వం నానాయాగీ చేసింది. చివరకు కేంద్రం జోక్యం చేసుకుని నీటిని విడుదల చేయించింది.

ఆంధ్రాలో అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జెన్‌కో పిపిఏలను రద్దు చేయడం కూడా ఇరు రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టింది. అసలే కరెంట్ లోటుతో వున్న తెలంగాణకు పిపిఏల రద్దు గోటిచుట్టు మీద రోకటిపోటులా మారింది. ఆ వెంటనే సీలేరు విద్యుత్ కేంద్రం సహా పోలవరం ముంపు ప్రాంతాలను ఆంధ్రాలో కలుపుతూ కేంద్రప్రభుత్వం చట్టసవరణ చేయడంతో తెలంగాణ సీఎం కల్లు తాగిన కోతిలా మారాడు. ఆంధ్రాపై కక్ష సాధింపుకు దిగాడు.

ఈ పరంపరలోనే ఫీజు రీయంబర్స్‌మెంట్‌పై పేచీకి దిగాడు. ఆంధ్రా నుండి తెలంగాణలోకి ప్రవేశించే వాహనాలపై పన్ను వసూలుకు శ్రీకారం చుట్టాడు. ఉమ్మడి రాష్ట్రంలో వాహనాల పన్నుకు 2015ఏప్రిల్ వరకు వెసలుబాటు వుంది. దీనిపై హైకోర్టు స్టే ఇచ్చింది. హైదరాబాద్ మాదాపూర్‌లో ఉన్న జాతీయ నిర్మాణ సంస్థ(న్యాక్)కు చట్టప్రకారం ఏపి సీఎం ఛైర్మెన్‌గా వ్యవహరించాలి. కాని తెలంగాణ ప్రభుత్వం ఈ భవనంలో పైఅంతస్థును స్వాధీనం చేసుకోవడమేకాక డిజిని కూడా నియమించింది. అలాగే ఆంధ్రా సీఎం చంద్రబాబు కూడా న్యాక్‌కు మరో డిజిని నియమించారు. ఇక ఎమ్మెల్యే క్వార్టర్స్ కేటాయింపుల్లోనూ ఇరు రాష్ట్రాల మధ్య వివాదముంది. ఉద్యోగుల విభజన, గవర్నర్‌కు విశేషాధికారాలు వంటి అంశాలపై కూడా ఇరురాష్ట్రాల మధ్య తీవ్ర ఘర్షణ వాతావరణముంది.

నిన్న మొన్నటి వరకు కలిసిమెలిసి వున్న ఈ తెలుగు ప్రాంతాలు ఇప్పుడు తన్నుకోవడానికి ప్రధాన కారణం అపరిపక్వతతో చేసిన విభజన పుణ్యమే. ప్రజల భవిష్యత్, ప్రాంతాల అభివృద్ధి దృష్టిలో లేకుండా పార్టీని అధికారంలోకి తేవాలి, కొడుకును ప్రధానిని చేయాలనే కోణంలో రాష్ట్రాలను విభజిస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయి.

# నిర్లక్ష్యం!

(మొదటిపేజీ తరువాయి)

ఏం లాభం. ఇప్పుడు రాష్ట్రం విడిపోయింది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందితే వేర్పాటు ఉద్యమాలు తలెత్తవని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

కాని ఇప్పుడేం జరుగుతుంది! రాష్ట్ర ప్రభుత్వం కొన్ని జిల్లాల మీద కన్నప్రేమను, ఇంకొన్ని జిల్లాల మీద సవతి ప్రేమను చూపిస్తుంది. కేంద్రం ప్రకటిస్తున్న జాతీయ విద్యా, వైద్య సంస్థలన్నింటిని సీమాంధ్రలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఆ జాబితాలో నెల్లూరుజిల్లాకు మాత్రం చోటివ్వడం లేదు. చేసిన తప్పునే మళ్లీ పునరావృతం చేస్తున్నట్లుగా విజయవాడ, గుంటూరులకే అన్నింటిని తీసుకుపోయే ప్రయత్నం చేస్తున్నారు. కృష్ణ, గుంటూరు జిల్లాల్లో భూసేకరణ సమస్య తీవ్రంగా వుంది. అక్కడ ఏ సంస్థను నెలకొల్పాలన్నా భూసేకరణకే వందలకోట్లు ఖర్చు చేయాల్సిన పరిస్థితి.

నెల్లూరుజిల్లాలో భూసేకరణ సమస్య లేదు. చాలా తక్కువ ఖర్చుతోనే అవసరమైన మేరకు భూసేకరణ చేసేయవచ్చు. ఇప్పటికే పలు సెజ్‌లలో వేలాది ఎకరాల భూములున్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయంకు గాని మత్స్య విశ్వవిద్యాలయానికి గాని నెల్లూరుజిల్లా అనువైన ప్రాంతం. కాని వీటిలో ఏ ఒక్కటీ నెల్లూరు జిల్లాకు కేటాయించలేదు. మొన్నటి ఎన్నికల్లో జిల్లా నుండి తక్కువసీట్లు వచ్చాయన్న కోపంతోనే తెలుగుదేశం ప్రభుత్వం నెల్లూరుజిల్లాను చిన్నచూపు చూస్తున్నట్లు వుంది.

# గూడూరు డివిజన్ వార్తలు

## పురపాలక సంఘం ఆదాయం పెంచాలి

పొనకా దేవసేన



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ పొనకా దేవసేన ప్రక్కన కమీషనర్ అనూరాధ

ప్రజలకు ఇబ్బంది లేకుండా పురపాలక సంఘం ఆదాయం పెంచాలని పురపాలక శాఖామంత్రి నారాయణ సూచించారని పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 24వతేదీన మంత్రి నారాయణతో హైదరాబాద్‌లో సమావేశం జరిగిందన్నారు. ఆ సమావేశంలో పట్టణ అభివృద్ధి గురించి ఆయనతో చర్చించామన్నారు. నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే దానికంటే స్థానికంగా ఆదాయవనరుల సమీకరణపై దృష్టి పెట్టాలన్నారు. అలాగే పట్టణంలో భూగర్భ డ్రైనేజీకి నిధులు కేటాయిస్తామన్నారు. వర్షాకాలంలో మొక్కల పెంపకం పై దృష్టి పెడతామన్నారు. పారిశుద్ధ్యం మెరుగుపరుస్తామని వెంటనే ఎల్‌ఈడి లైట్లు వేయిస్తామన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అనురాధ కూడా పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు.

## గాంధీనగర్‌లో ఇళ్ల స్థలాల పంపిణీకి చర్యలు

తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి



మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి

గూడూరు సమీపాన వున్న గాంధీనగర్‌లో మూడవ విడత కార్యక్రమంలో ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన ఇళ్లస్థలాలు పంపిణీకి కసరత్తు చేయాలని గృహనిర్మాణశాఖ డీఈ నిరంజన్‌ను తహశీల్దార్ వెంకటేశ్వర్లురెడ్డి కోరారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల స్థలాలు లబ్ధిదారులకు అందజేయడంపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గతంలో 3వేల లబ్ధిదారులకు స్థలాల కోసం వేసిన లే అవుట్ ప్రాంతంలోనే తిరిగి రాళ్లను నాటించడానికి 10లక్షలు నిధులు ఖర్చు అవుతుందని గృహనిర్మాణశాఖాధికారులు తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తులనాడు వచ్చిన అర్జీలపై తహశీల్దార్ అధికారులతో సమీక్షించి తక్షణమే చర్యలు తీసుకొంటానని ఆదేశించారు.

## ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- ఎమ్మెల్యే పాశం సునీల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రక్కన వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన అధికారులు తాపీగా ప్రమాదాలు జరిగాక స్పందిస్తారా అంటూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని రోడ్లు భవనాల అతిథి గృహంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మెదక్ జిల్లాలోని మాసాయిపేట వద్దగల కాపలాలేని రైల్వే గేటు దగ్గర పాఠశాల బస్సును రైలు ఢీకొని చిన్నారులు మృత్యువాత పడ్డారని, అక్కడ రెండు రోజులు తిరగకముందే గేటును ఏర్పాటు చేశారన్నారు. అదే ముందుగా భద్రత చర్యలు చేపట్టి ఉంటే ప్రాణనష్టం జరిగేది కాదన్నారు. నియోజకవర్గంలో ఉన్న పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సుల నిర్వహణపై స్థానిక అధికారులు దృష్టిసారించాలన్నారు. ఆర్డీవో, డీఎస్పీ, ఆర్టీవో తదితర అధికారులు పాఠశాలలకు చెందిన బస్సులను తనిఖీలు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

చాలా బస్సులను వయస్సు మళ్లిన వారే నడుపుతున్నారన్నారు. ఆటోల్లో కిక్కిరిసిన విద్యార్థులను తరలించడం వల్ల ఏదైనా అనుకోని సంఘటన చోటు చేసుకుంటే భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు. వీటిపై అధికారులు దృష్టిసారించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని కోరారు. గూడూరు మండలంలో ఉపాధి హామీ పథకంలో కోటి రూపాయల మేర అవినీతి జరిగిందని, దీనిపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మెట్టా రాధాకృష్ణారెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ఎంబేటి చంద్రయ్య, నవీన్ జయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ వేడుకలు

సోమవారం రాత్రి ఆకాశంలో నెలవంక కనిపించడంతో ముస్లిం సోదరుల్లో ఆనందోత్సవాలు మిన్నంటాయి. రంజాన్ పండుగను ఘనంగా జరుపుకొన్నారు.

గూడూరు పట్టణంలోని హైస్కూలు రోడ్డులో ఉన్న పెద్ద మసీదు, దర్గా, వీరారెడ్డిపల్లె వద్ద నున్న మసీదు తదితర ప్రాంతాల్లో ఉన్న మసీదులను సుందరంగా అలంకరించారు. మసీదుల ముందు యువత బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. పండుగ పవిత్రత, నియమాలు, దీక్షలు, నమాజ్ వంటి విషయాలను వివరించారు. మసీదుకు తీసుకెళ్లి వారితో ప్రార్థనలు చేయించారు. రంజాన్ చిత్రాలను వారితో గీయించారు.

## గూడూరు డీఎస్పీకి సన్మానం



డీఎస్పీ కె.చౌడేశ్వరిని సన్మానిస్తున్న వైజేపీ, ఎస్ఎస్‌వీవో సంస్థల ప్రతినిధులు



కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అంతర్ జిల్లాల దొంగను చాకచక్యంగా పట్టుకొని ఆయన వద్ద నుంచి 12లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న గూడూరు డీఎస్పీ కె.చౌడేశ్వరిని సోమవారం సాయంత్రం వైజేపీ లయన్స్ క్లబ్ మరియు సర్వీస్ అండ్ సపోర్ట్ వాలంటరీ ఆర్గనైజేషన్ ప్రతినిధులు సన్మానించారు. గూడూరు ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయా ప్రతినిధులు మంజులాదేవి, నాను మునీంద్రరెడ్డి మాట్లాడుతూ వివిధ సమస్యలపై పోలీసుస్టేషన్‌లకు వచ్చే పేదలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని కోరారు. 2012లో వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన ఆభరణాలు రికవరీ చేయడంలో కృషి చేశారన్నారు. అందుకు సహకరించిన ఒకటో పట్టణ ఎస్సైలు బాబీ, అజయ్‌కుమార్, కానిస్టేబుల్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు మురళీనాయుడు, గురునాథం, ఎస్ఎల్ఎన్ స్వామి, వెంకటసుబ్బయ్య, ఎస్ఎల్ఎన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

● గాంధీనగర్‌లో వున్న...

## మద్యం దుకాణాన్ని తొలగించాలి



ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గూడూరు పట్టణ సమీపాన వున్న గాంధీనగర్‌లో ఏర్పాటైన మద్యం దుకాణాన్ని తొలగించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఇళ్ల మధ్య కాకుండా దుకాణాన్ని మరో చోట ఏర్పాటుచేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. మద్యం దుకాణం ఇళ్ల మధ్య ఉండటంతో మందుబాబుల ఆగడాలు అధికంగా ఉన్నాయన్నారు. మహిళలు బయటకు రావాలంటే భయాందోళనలు వ్యక్తంచేస్తున్నారన్నారు. అనంతరం గూడూరు ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు.

## ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవు

- జడ్జి పి.గురప్ప





మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప

ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని ఏడో అదనపు జిల్లా జడ్జి పి.గురప్ప పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు గురించి ఆయన వివరించారు. తప్పు చేస్తే తప్పించుకొని పారిపోతే మరలా దొరకమని అనుకోవడం పొరపాటని హెచ్చరించారు. ప్రయాణీకులను క్షేమంగా గమ్యానికి చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్‌పై ఉందన్నారు. పరిస్థితులను బట్టి నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలని కోరారు. పట్టణంలో వేగంగా ఆటోలు నడపడం సరికాదని అన్నారు. మెదక్ జిల్లాలో డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా పసిపిల్లలు మృతి చెందారని దీనిని తెలుసుకొని వాహనం నడపాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జి డి.ఏడుకొండలు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి పి.దివాకర్, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ జడ్జి కె.పి.సాయిరాం, డిఎస్పీ కె.చౌడేశ్వరి, ఆర్టీవో రాంప్రసాద్, పట్టణసిఐ నాగభూషణం, ఎస్సైలు, ఆటో డ్రైవ్ యూనియన్ నాయకులు, వి.వి.రమణయ్య, వెంకటరమణయ్య, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలపై

## ఆర్డీవోను కలిసిన బాధితులు



ఆర్డీవో కె.శ్రీనివాసరావును కలిసిన ఓడూరు గ్రామ రైతులు

గూడూరు డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు ఏళ్ల తరబడి యథాతథంగానే ఉన్నాయని, వాటికి పరిష్కార మార్గం చూపాలని బాధితులు ఆర్డీవో కె.శ్రీనివాసరావును కలిసి విన్నవించారు. గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటగిరి మండలంలో, బాలయపల్లి మండలంలో పట్టాదారు పాసుపుస్తకములు, ఇంటి పట్టాలు ఇవ్వలేదని, రెవెన్యూ అధికారులు తిప్పుకుంటున్నారని మండలంలోని పల్లెపాడు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. చిల్లకూరు మండలం ఓడూరు గ్రామంలో రేషన్ షాపు డీలరు సరిగా సరుకులు ఇవ్వడంలేదని తూకాలు తగ్గించి ఇస్తున్నారని ఆ గ్రామస్తులు ఆర్డీవోకు విన్నవించారు. ఇంకా పలు మండలాల రైతులు ఆర్డీవోకు తమ వినతులను సమర్పించారు.

# పదవుల పందేరానికి కసరత్తు

జిల్లాలో తెలుగుతమ్ముళ్ళకు నామినేటెడ్ పదవులు పంచడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. తెలుగుతమ్ముళ్ళు పదవులు చేపట్టడానికి వీలుగా గత ప్రభుత్వంలో ఆయా కమిటీలకు ఛైర్మెన్‌లు, సభ్యులుగా పదవులు చేపట్టిన వారిని రాజీనామా చేయమని కోరుతున్నట్లు సమాచారం.

పదేళ్లుగా తెలుగుతమ్ముళ్లు ఎటువంటి పదవులు లేక ఖాళీగా ఉన్నారు. పార్టీ కోసం ఇంతకాలం సొంత డబ్బులే ఖర్చు చేసుకున్నారు. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో వారిలో ఆశలు మొగ్గతొడిగాయి. త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుంది. రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మెన్‌లు, డైరక్టర్ పదవులతో పాటు జిల్లాలో ఆర్టీసీ, స్త్రీ శిశు సంక్షేమశాఖ, దేవాదాయ కమిటీలు, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, గ్రంథాలయం వంటి నామినేటెడ్ పదవులు చాలానే వున్నాయి. ఇప్పటికే పలువురు నాయకులు ఏఏ దేవస్థానాలకు ఛైర్మెన్‌లు కావాలి, సభ్యులు కావాలనే దానిపై పార్టీ పెద్దలకు తమ బయోడేటాలు అందించారు. జిల్లాలో అసెంబ్లీకి పోటీ చేసిన అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలోనే ఓడిపోయి ఉన్నారు. వాళ్లు కూడా ఒక మోస్తరు స్థాయి నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నారు.

# విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని కోల్పోవద్దు




విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకు పోవాలని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా॥టి.నారాయణ అన్నారు. గురువారం నెల్లూరు వాత్సల్యలోని భారతీయ విద్యావికాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అనూష మెమోరియల్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్, క్యారమ్స్, జ్ఞాపకశక్తిని పెంచుతాయన్నారు. క్షణికావేశానికిలోనై విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడరాదని, చదువు లేకున్నా ఎందరో మహానుభావులు ఉన్నతస్థితికి ఎదిగారన్నారు.

భారతీయ విద్యావికాస్ స్కూలు కరస్పాండెంట్ జి.వి.సాంబశివరావు మాట్లాడుతూ అనూషకు తల్లిదండ్రులు లేని కారణంగా నిరాధార బాలబాలికల వసతి గృహంలో పెరిగిందని, పాలిటెక్నిక్ మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్టులో ఫెయిల్‌కావడం వలన జూన్20న ఆత్మహత్య చేసుకుందని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సామంతు గోపాల్‌రెడ్డి, టి.వి.యస్.దుర్గాప్రసాద్, ఎ.జయప్రకాష్, మధుసూదనరెడ్డి, సుమన్, నజీర్ బాషా, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

# స్థానిక సమస్యలకు ప్రాధాన్యం



గురువారం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 33, 34డివిజన్‌లలో రూరల్‌ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నగర మేయర్ అబ్దుల్ అజీజ్ ఆయా వార్డులో పర్యటించారు. వారి వెంట నగర మున్సిపల్ కమీషనర్ శ్యామ్‌సన్, హెల్త్ అధికారులు, శానిటరీ సిబ్బంది, ఇంజనీరింగ్ అధికారులతో స్థానిక కార్పొరేటర్లు పెంచలయ్య, యస్.కె.తాజునీ పాల్గొన్నారు. 33, 34డివిజన్‌లోని ఆయా వార్డుల్లో స్వయంగా తిరిగి స్థానిక సమస్యలపై ప్రజలతో ముఖాముఖికి నిర్వహించారు. పారిశుద్ధ్యం మెరుగుకోసం ప్రత్యేక ఆదేశాలు జారీచేసారు. స్థానికంగా కలుషిత మంచినీటి సమస్య గత పాలకుల ధన దాహం వల్ల వాటిల్లిన సమస్యలకు దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. స్థానికంగా పేరుకుపోయిన కాలువ పూడికతీతకు, కల్వర్టు నిర్మాణం సాగిస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ రాజకీయ జెండాలు, అజెండాలు పక్కనపెట్టి అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతామని నగర కార్పొరేషన్‌లో అన్ని పార్టీల ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో ఎక్కడికక్కడ స్థానిక పెద్దల సలహాలతో నెల్లూరు నగరాన్ని సుందర నగరంగా మారుస్తామని ఎక్కడికక్కడ ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగుతామని చెప్పారు. పై కార్యక్రమంలో హజరత్‌నాయుడు, డా॥సత్తార్, పర్వతాల శ్రీనివాసగౌడ్, శ్రీనివాసులురెడ్డి, మేఘనాథ్ సింగ్, పసుపులేటి శ్రీధర్, సూరి, అనీల్‌రెడ్డి, సామ్రాజ్యం, మూర్తి, నంద, రాము, తుమ్మల శ్రీనివాసులు, నాగా ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ శ్మశాన వాటిక ఛైర్మెన్‌గా రాఘవేంద్రశెట్టి



నెల్లూరు పెన్నానది ఒడ్డున వున్న రోటరీ స్మశాన వాటిక నూతన ఛైర్మెన్‌గా ఎస్.రాఘవేంద్రశెట్టి ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. గతంలో రోటరీ శ్మశాన వాటికకు వ్యవస్థాపక కార్యదర్శిగా కూడా సేవలందించారు. రాఘవేంద్రశెట్టి నెల్లూరు రోటరీ క్లబ్ అధ్యక్షులుగా, రోటరీ క్లబ్ జిల్లా కార్యదర్శిగా మరియు రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారు. 2010–2011 రోటరీ క్లబ్, నెల్లూరు అధ్యక్షులుగా చేసిన విశిష్ట సేవలను గుర్తించి రోటరీ ఇంటర్నేషనల్ వారు ప్రతిష్టాత్మకమైన రోటరీ ఇంటర్నేషనల్ ప్రెసిడెన్షియల్ సైటేషన్ విత్ డిస్టింక్షన్ అంతర్జాతీయ అవార్డును బహూకరించారు. రాఘవేంద్రశెట్టి 2012–13సం॥న ఎ.సి.సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. దానికిగాను వాకర్స్ ఇంటర్నేషనల్ వారిచే ఉత్తమ అధ్యక్షులుగా ఉత్తమ సేవాక్లబ్‌గా అవార్డు పొందారు.





ఉత్తరక్రియలు



స్వర్గీయ ఆలూరు వెంకట సుబ్బారెడ్డి గారు
(తాతగారు)
వ్యవస్థాపకులు, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, కోవూరు

మా ఇంటి దైవం, మా అభివృద్ధికి కారకులు,
దైవభక్తి పరాయణుడు
శ్రీ ఆలూరు వెంకట సుబ్బారెడ్డి గారు
తేది 21-07-2014 సోమవారం నాడు స్వర్గస్తులైనారు.

వారి ఆత్మకు శాంతిని కలుగజేయమని భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కుమారులు - కోడళ్లు
ఆలూరు శ్రీనివాసులురెడ్డి - సుజాతమ్మ
ఆలూరు అనిల్‌కుమార్‌రెడ్డి - శోభన
ఆలూరు రఘునాథరెడ్డి - అనూరాధ

కుమార్తె - అల్లుడు
పద్మజ - గుండాల భాస్కర్‌రెడ్డి

మనుమలు - మనుమరాళ్లు
ఆలూరు ప్రదీప్‌రెడ్డి - సుష్మ
డా॥ ఆలూరు స్వరూప్‌కుమార్‌రెడ్డి - రూప
(కేర్ డెంటల్ హాస్పిటల్, నెల్లూరు)
సుష్మిత - పిడతల భాస్కర్‌రెడ్డి (USA)
ఆలూరు శ్రీకాంత్‌రెడ్డి - సాహితి
డా॥ సహజ - డా॥ శ్రీధర్‌రెడ్డి
డా॥ సాహిత్య - ప్రశాంత్
గుండాల వినయ్‌రెడ్డి(USA) - చైతన్య
గుండాల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి - శ్రావ్య

మరియు మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

ఉత్తరక్రియలు
తేది 06-08-2014, బుధవారం నెల్లూరుజిల్లా,
కోవూరు పాటూరురోడ్డులోని మా స్వగృహము నందు జరుగును.
కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.


Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.